సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 04.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 132
పేజీలు: 12 వెల: రూ. 5



09

## గ్రహణంతో మూతబడ్డ ఆలయాలు

- తిరుమల, విజయవాడ, వేములవాడ, యాదాద్రిలో దర్శనాలు బంద్
- మంగళవారం మధ్యాహ్నం 3.21 గంటలకు ప్రారంభమై రాత్రి 7.52 గంటల వరకు

## రాష్ట్ర ఖజానా ‘నిల్’యేనా?

రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయండి

సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ



- ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- ఖజానా ఖాళీ అంటూ హామీల నుంచి తప్పించుకుంటున్నారని విమర్శ
- సోనియా, రాహుల్ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తామన్న వ్యాఖ్యలపై ఆగ్రహం
- కేంద్రం రూ.12 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని కిషన్ రెడ్డి స్పష్టం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పుల బారిన పడిందని ఆరోపణ

03

## అంబరాన్నంటిన హోలీ వేడుకలు

03

వాడవాడలా సందడే సందడి

రాష్ట్రవ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్దా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి యువత డీజే పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ.. కేరింతలు కొడుతూ వేడుకలు చేసుకున్నారు.



# వినాశనపు అంచున విశ్వం

10

‘అణు’ మేఘాల నీడలో ప్రపంచం.. మానవత్వం చివరి అంచునా?

ఒక్క బాంబు చాలు.. భూమిపై సూర్యకాంతి కరిగిపోవచ్చు!

- ఇరాన్–ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు.. ప్రపంచ యుద్ధానికి ముంగిటా?
- ‘అణు శీతాకాలం’ భయం.. పంటలేని భూమి, ఆకలితో మానవాళి?
- ప్రతీకార రాజకీయాలు.. భూగోళానికి మరణ శాసనం?
- ఐన్‌స్టీన్ హెచ్చరిక నిజమవుతుందా? రాతి యుగం వైపు ప్రపంచం!
- గల్ఫ్ ప్రాంతం లక్ష్యంగా అణు అగ్ని.. ఇంధన కేంద్రం బూడిద కాబోతుందా?
- గెలుపు ఎవరికి? మిగిలేది వల్లకాడు, బూడిద మాత్రమే!
- శాంతి మార్గమా? శ్మశాన నిశ్శబ్దమా? ప్రపంచ దేశాల ముందున్న ఎంపిక!
- పిల్లల భవిష్యత్తుకు పచ్చని భూమా.. అణు బాంబుల బూడిదా?



మనిషి మెదడు సృష్టించిన మహాద్భుతం శాస్త్ర సాంకేతికత.. కానీ అదే మెదడు కనిపెట్టిన మృత్యుపాశం 'అణుబాంబు'. దేవుడు ప్రసాదించిన 84 లక్షల జీవరాశుల్లో అత్యంత తెలివైనవాడు అనుకుంటున్న మనిషి, నేడు తన స్వార్థంతో ప్రపంచాన్ని వల్లకాడుగా మార్చేందుకు సిద్ధమయ్యాడు. ఇరాన్ యుద్ధ మేఘాల చాటున పొంచి ఉన్న అణు ముప్పు, కేవలం గల్ఫ్ దేశాలనే కాదు.. మొత్తం భూమండలాన్నే కనుమరుగు చేసే మారణ శాసనంలా మారుతోంది. ప్రపంచం వినాశనపు అంచున నిలబడి ఉంది.. అగ్రరాజ్యాల అహంకారం, స్వార్థం వెరసి ఈ పచ్చని ప్రకృతిని బూడిద కుప్పగా మార్చేందుకు సిద్ధమవుతున్నాయి. ఒక్క అణుబాంబు పేలినా అది గొలుసుకట్టు చర్యగా మారి సర్వమానవాళి అంతానికి దారితీస్తుందన్న భయాలు ఇప్పుడు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. ఇరాన్ యుద్ధం సాకుతో అణ్వాయుధాలు గనుక గర్జించిటే.. ఇక మిగిలేది గెలుపు కాదు, కేవలం స్మశాన నిశ్శబ్దం మాత్రమే.

-ముద్ర డెస్క్

## అణు భయాలు.. చమురు రాజకీయాలు


10

ఇరాన్‌పై అమెరికా దాడుల అసలు కారణాలు

- పెట్రోడాలర్ నుంచి ప్రాంతీయ ఆధిపత్యం వరకు యుద్ధానికి దారితీసిన పరిణామాలు
- ఇజ్రాయెల్ భద్రతా ఆందోళనలు, ఇరాన్ అణు ప్రణాళికలు
- అందుకే అగ్రరాజ్యం రంగంలోకి?
- చరిత్రాత్మక వైరం మళ్లీ ముదిరింది
- చైనా, రష్యా ప్రభావం చెక్ చేయడానికేనా?
- ఇరాన్‌పై అమెరికా దాడుల వ్యూహం

## మూసీ రివర్ ఫ్రంట్ పనులకు బ్రేక్ ?

మూసీ తీరంలో పర్యావరణ విధ్వంసం



- సమగ్ర అధ్యయనం లేకుండానే పనులు
- లంగర్ హౌస్ నుంచి నార్సింగి వరకు మహావృక్షాల తొలగింపుపై న్యాయ పోరాటం ప్రారంభం
- ఎన్‌హెచ్ఆర్‌సీని ఆశ్రయించిన న్యాయవాది రామారావు
- జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో కేసు నమోదు
- మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు వరుస అడ్డంకులు

09



## గ్రహణం ముగిశాక భక్తుల స్నానాలు

జగిత్యాల జిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రంలో సంపూర్ణ కేతుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా గోదావరి నదిలో భక్తులు భక్తిశ్రద్ధలతో గ్రహణ స్నానాలు ఆచరిస్తున్నారు. గ్రహణ సమయాన్ని పురస్కరించుకొని భక్తులు జపాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

## దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలొస్తాయా?

హర్ముజ్ జలసంధి మూసివేత

- నిలిచిపోయిన 150 ఆయిల్ ట్యాంకర్లు
- భారత్ కు ఆయిల్ కష్టాలు తప్పవా?

09




## ప్రమాదం అంచున సరళాసాగర్!

మరమ్మతుకు నోచుకోక బీటలు వారిన సైఫన్లు



- ఆసియాలో మొదటి సైఫన్ సిస్టమ్ ప్రాజెక్టు
- ప్రాజెక్టు సామర్థ్యం నీటి మట్టం వస్తే ఆటోమెటిగా సైఫన్లు ఓపెన్
- నిర్మాణం నుంచి మరమ్మతులకు నోచుకోని సైఫన్‌లు

10

ఆసియా ఖండంలోనే మొట్టమొదటి ఆటోమేటిక్ సైఫన్ వ్యవస్థగా, అరుదైన ఇంజనీరింగ్ అద్భుతంగా పేరుగాంచిన 'సరళాసాగర్' ప్రాజెక్టు నేడు పాలకుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. వనపర్తి సంస్థానాధీశుల కాలంలో నిర్మితమై, దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రమాదం అంచున కొట్టు మిట్టాడుతోంది.

– ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి



## తెలంగాణ ప్రగతికి పవర్ ఫుల్ నిదర్శనం

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి 18,139 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు

- అంతరాయం లేకుండా రికార్డు లోడ్‌ను నిర్వహించిన విద్యుత్ సంస్థలు
- పెద్ద రాష్ట్రాలకు సమానంగా తెలంగాణ సామర్థ్యం: డిప్యూటీ సీఎం భట్టి ప్రశంసలు
- పారిశ్రామిక, వ్యవసాయ వృద్ధితో పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- గత మూడు సంవత్సరాల్లో వేగంగా పెరిగిన గరిష్ట విద్యుత్ డిమాండ్ గణాంకాలు
- వేసవి గరిష్ట అవసరాలకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధమైన ప్రభుత్వం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రం మరోసారి తన అప్రతిహత ప్రగతిని చాటుకుంది. రాష్ట్ర చరిత్రలో అత్యధికంగా మంగళవారం ఒక్క రోజే 18,139 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ తో ఆల్ టైం రికార్డు సృష్టించింది. రాష్ట్ర విద్యుత్ సంస్థలు మంగళవారం ఉదయం 11:01 గంటలకు నమోదైన 18,139 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను ఎలాంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా నిర్వహించాయి, ఇది రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక గరిష్ట డిమాండ్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర విద్యుత్ సంస్థ చరిత్రలోనే గరిష్ట డిమాండ్ ను ఎటువంటి ఆటంకాలు లేకుండా మిగతా 02లో

## ‘ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక’పై నిర్లక్ష్యం వద్దు

సచివాలయంలో కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

- పనుల పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్
- 99 రోజుల కార్యాచరణలో భాగస్వామ్యం అవసరం
- గ్రామం నుంచి జిల్లాస్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** సంక్షేమ పథకాలు.. అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో నిర్వహించతలపెట్టిన 99 రోజుల ‘ప్రజా పాలన _ ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లు, సెలబ్రెటీలను భాగస్వాములను చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. అందుకోసం వార్డు సభ్యులు, సర్పంచులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లు అందరికి జిల్లా కేంద్రాల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. వారి మిగతా 02లో

## ప్రతీకారమా? పట్టుబలమా?

11


ముంబై వేదికగా భారత్–ఇంగ్లాండ్ సెమీస్ ఫైట్!




- అభిషేక్ ఊపు.. సూర్య జోరు.. వాంఖడే గడ్డపై ఇంగ్లాండ్‌ను టీమిండియా నిలువరిస్తుందా?
- రెండు జట్లూ సూపర్ ఫామ్‌లోనే.. మూడో టైటిల్ దిశగా అడుగేసేది ఎవరు?

ఇదీ ఏఐ ముద్ర


ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు, పెట్రోల్ ధరల భయం, ఎన్నికల హామీలు నెరవేరకపోవడం.. ద్రవ్యోల్బణం సూచనలతో సామాన్యుడు భిక్కుభిక్కుమంటున్నాడు..



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 04.03.2026
www.mudranews.in | @mudranews



## ఎండాకాలం జాగ్రత్తలు




**నీరు తాగాలి**

రోజుకు కనీసం 3—4 లీటర్ల నీరు తాగడం మంచిది. దాహం లేకపోయినా కొద్దికొద్దిగా నీరు తీసుకుంటే డీహైడ్రేషన్ తప్పుతుంది.

# తెలంగాణ ప్రగతికి 'పవర్' ఫుల్ నిదర్శనం



**(మొదటి పేజీ తరువాయి)**
విజయవంతంగా పూర్తిచేసి నాణ్యతతో కూడిన విద్యుత్ సరఫరా చేసిన విద్యుత్తు రంగంలోని ఉన్నతాధికారులు, యావత్ సిబ్బందికి డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ మైలురాయి తెలంగాణ ఆర్థిక వృద్ధి, కార్యనిర్వహణ సామర్థ్యం, అద్భుత సమన్వయానికి నిదర్శనం అని అందులో పేర్కొన్నారు. భౌగోళికంగా చిన్న రాష్ట్రం అయినప్పటికీ, పెద్ద రాష్ట్రాల గరిష్ఠ లోడ్లను సమానంగా లేదా అధిగమించే స్థాయికి చేరుకున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రగతి పారిశ్రామిక, వ్యవసాయ, పట్టణాభివృద్ధిలో మన వేగాన్నిస్పష్టం చేస్తోందన్నారు. సమకాలీన అవసరాలను తీర్చడంతో పాటు రాబోయే వేసవి గరిష్ఠ డిమాండ్‌లకు ముందస్తు ప్రణాళికలతో తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని భట్టి తెలిపారు. బలమైన గ్రిడ్ వ్యవస్థ, ముందు చూపు ప్రణాళిక, సమన్వయంతో ఉన్న వ్యవస్థ మన బలం అన్నారు. తెలంగాణ విద్యుత్ రంగం అభివృద్ధిని ముందుకు నడిపేలా రూపుదిద్దుకుందని చెప్పారు. కంట్రోల్ రూముల నుంచి నుంచి ఫీల్డ్ సిబ్బంది వరకు ప్రతి ఒక్కరి కృషితోనే ఈ విజయాన్ని సాధించామని చెప్పారు.

**జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రతిభ**
18,139 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్‌తో తెలంగాణ రాష్ట్రం, సుమారు 19,900 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్‌ను నమోదు చేసిన మధ్యప్రదేశ్, అలాగే 19,600–20,600 మెగావాట్ల మధ్య గరిష్ఠ డిమాండ్ నమోదైన రాజస్థాన్ వంటి పెద్ద రాష్ట్రాలకు సమానంగా నిలిచింది అన్నారు. భూభాగం, జనాభా పరంగా చిన్నదైనా తెలంగాణ తన సామర్థ్యాన్ని చాటింది అన్నారు. అదే విధంగా పంజాబ్, హర్యానా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి పారిశ్రామిక రాష్ట్రాల కంటే ఎక్కువ గరిష్ఠ డిమాండ్‌ను తెలంగాణ నమోదు చేసిందనీ భట్టి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ భౌగోళికంగా చిన్నదైనా, అధిక విద్యుత్ వినియోగ సాంద్రత కలిగిన రాష్ట్రంగా నిలుస్తోందని వెల్లడించారు. ఐటీ, ఔషధ తయారీ, తయారీ రంగం, సాగునీటి విస్తరణ వంటి రంగాల్లో వేగవంతమైన వృద్ధి దీనికి ప్రధాన కారణం అని డిప్యూటీ సీఎం వివరించారు.

**వేగవంతమైన డిమాండ్ పెరుగుదల**
తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుదల కనిపిస్తోందన్నారు.
2023–24: గరిష్ఠ డిమాండ్15,623 మెగావాట్లు (08.03.2024)
2024–25: గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు(20.03.2025)
2025–26: (మునుపటి గరిష్టం): 17,162 మెగావాట్లు
2026 (ప్రస్తుతం): 18,139 మెగావాట్లు(03.03.2026) – కొత్త గరిష్ఠ దశలోకి ప్రవేశించామని వివరించారు.

# మోడీ దెబ్బకు బెండ్ అయిన ఎలన్ మస్క్

## ప్రభుత్వ నిబంధనలకు తలొగ్గిన 'ఎక్స్'

**ముద్ర డెస్క్:**
డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వేదికలు సమాచార ప్రసారానికి మాత్రమే కాకుండా వినోదం, వ్యక్తిగత వ్యక్తీకరణకు ప్రధాన కేంద్రాలుగా మారాయి. అయితే అదే సమయంలో అసభ్య, అశ్లీల కంటెంట్ విస్తరణపై సమాజంలో పెరుగుతున్న ఆందోళనలు ప్రభుత్వాలను కఠిన నిర్ణయాల వైపు నడిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ సోషల్ మీడియా వేదిక ఎక్స్ భారత్‌లో పెద్ద నిర్ణయం తీసుకుంది. దేశంలో అసభ్య/అడల్ట్ కంటెంట్‌ను జియో–బ్లాక్ చేస్తూ కీలక చర్యలు ప్రారంభించింది.
ఇప్పటికే భారత ప్రభుత్వం అశ్లీల వెబ్‌సైట్లపై కఠిన నిషేధం విధించిన విషయం తెలిసిందే. మహిళలపై అవమానకర కంటెంట్, అసామాజిక ధోరణులు పెరుగుతున్నాయనే కారణాలతో ప్రభుత్వం పలు పోర్న్ వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది. అదే దిశగా సోషల్ మీడియా వేదికలపై కూడా నియంత్రణలు కట్టుదిట్టం చేస్తోంది. ఈ క్రమంలో 'ఎక్స్' తీసుకున్న తాజా నిర్ణయం ప్రభుత్వ విధానాలకు అనుసరణగా భావిస్తున్నారు.
ఈ పరిణామంపై ఒక నెటిజన్ 'ఎక్స్' సంస్థకు చెందిన ఏఐ చాట్‌బాట్ గ్రోక్‌ను ప్రశ్నించగా, భారత్‌లో అడల్ట్ వీడియోలను జియో–బ్లాక్ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. "మార్చి 3, 2026 నుంచి భారత్‌లో పరస్పర సమ్మతితో రూపొందించిన అడల్ట్/సెక్సువల్ వీడియోలను జియో–బ్లాక్ చేస్తున్నాం. ఇది ప్రభుత్వ అసభ్య కంటెంట్ నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా తీసుకున్న చర్య" అని గ్రోక్ వివరణ ఇచ్చింది.
అయితే ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లో ఈ కంటెంట్ పూర్తిగా నిషేధం కాలేదని కూడా స్పష్టం చేసింది. అక్కడ సెన్సిటివ్‌గా ట్యాగ్ చేయబడిన కంటెంట్ మాత్రమే అనుమతించబడుతుందని.. ముఖ్యంగా పిల్లలు లేదా అనుమతి లేని వీక్షకుల దృష్టికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపింది. అంటే భారత్‌లో మాత్రమే ఈ కంటెంట్‌కు పూర్తి స్థాయి నిరోధం అమల్లోకి వచ్చినట్లు అర్థమవుతోంది.
సమాజ శ్రేయస్సు దృష్ట్యా ఈ నిర్ణయాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. ముఖ్యంగా యువతపై.. బాలలపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్న ఈ కాలంలో అశ్లీల కంటెంట్ నియంత్రణ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహిళల గౌరవం, కుటుంబ విలువలు, సాంస్కృతిక పరిరక్షణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ ఈ చర్యను సమర్థిస్తున్నారు.
అయితే మరోవైపు డిజిటల్ స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కుల పరిరక్షణ కోణంలో విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇంటర్నెట్ వేదికలు స్వేచ్ఛా వ్యక్తీకరణకు నిలయాలుగా ఉండాలని భావించే వర్గాలు ఈ నిర్ణయంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయినప్పటికీ దేశీయ చట్టాలకు అనుగుణంగా సంస్థలు పనిచేయాల్సిందేనన్న వాదన బలంగా వినిపిస్తోంది.
భారత్‌లో డిజిటల్ కంటెంట్ నియంత్రణలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా చెప్పవచ్చు. ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలకు అనుగుణంగా సోషల్ మీడియా సంస్థలు కూడా తమ విధానాలను మార్చుకుంటున్నాయి. దీని ప్రభావం భవిష్యత్తులో ఇతర వేదికలపైనా పడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.
డిజిటల్ ప్రపంచంలో స్వేచ్ఛా పరిమితుల మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.





## 'ప్రజా పాలన_ ప్రగతి ప్రణాళిక'పై

# నిర్లక్ష్యం వద్దు

**(మొదటి పేజీ తరువాయి)**
విధులు, బాధ్యతలకు సంబంధించి అవగాహన కల్పించడంతో పాటు ప్రింటెడ్ మెటీరియల్ అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి... పరిపాలనలో వేగం, సమన్వయం, లక్ష్య సాధనపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి పట్టం కట్టారన్న సీఎం వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ బృహత్తర యజ్ఞంలో కలెక్టర్లూ భాగస్వాములై.. గ్రామీణ, పట్టణ ప్రజల సమస్యలు, అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. రానున్న 99 రోజులు జిల్లా కలెక్టర్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్న రేవంత్ రెడ్డి.. తమ పరిధిని దాటి వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కారించడం కోసమే అధికార యంత్రాంగం పనిచేయాలని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. క్షేత్ర స్థాయిలో ప్రతీ అర్హుడికి అందాలని సీఎం అన్నారు. కింది స్థాయిలో అధికార యంత్రాంగం పనితీరు మరింత మెరుగుపడాలని.. ప్రభుత్వ పథకాలు, సేవల్లో పారదర్శకత పెరగాలని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి చేకూరే లబ్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదేనని సీఎం రెడ్డి తేల్చి చెప్పారు.





కాంగ్రెస్ సర్కార్ ఇస్తున్న రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు సంబంధించిన ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు.
మరీ ముఖ్యంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామని.. ఆ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజల అభిప్రాయాలు సేకరించాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. పంచాయతీల్లో గ్రామ సభల వేదికగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ పైసా లబ్ధిని ప్రజలకు వివరించడం ద్వారా ప్రభుత్వం తరపున పారదర్శకత పెరుగుతుందని వెల్లడించారు. గ్రామ, వార్డు సభలు నిర్వహించి నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలి. వాటితో గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి కలిగిన లబ్ధిని ప్రజలకు వెల్లడించాలని సూచించారు. అలాగే తెలంగాణ విద్యా వ్యవస్థలో తమ ప్రభుత్వం తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ స్కూళ్లు బలోపేతం అయ్యే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం బిల్లులను ప్రతీ నెలా ఆయా ఏజెన్సీలకు చెల్లించాలని ఆదేశించారు. ఈ పథకానికి నిధుల కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లకే ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను మరింత పటిష్ఠం చేసేందుకు వాటి సమీపంలో ఉన్న మెడికల్ కాలేజీలతో హాస్పిటల్స్‌ను అనుసంధానం చేయాలని సూచించారు.
సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న సీఎం.. వ్యవసాయ పంప్ సెట్లకు బదులు సోలార్ పంప్ సెట్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సోలార్ మోటార్లతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. ఇళ్లపైన సోలార్ ప్లాంట్లు అమర్చుకోవడం.. సోలార్ విద్యుత్ వాడుకోవటంతో పాటు గ్రిడ్ కు కనెక్ట్ చేయడం ద్వారా వచ్చే ఆదాయంపై అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖ అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కళాశాలల సేవలు ప్రజలకు అందేలా చూడాలని సీఎం సూచించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఇతర స్థానిక వైద్య సంస్థలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకే రిఫర్ చేయాలన్నారు. మెడికల్ కళాశాలల్లోఅత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో పాటు వైద్య విద్యార్థులు, వైద్యులు, ప్రొఫెసర్లు ఉన్నారనీ వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి ప్రభుత్వ పథకంలో లబ్ధిదారుల ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నైజేషన్) చేపట్టాలని సీఎం.. కలెక్టర్లను ఆదేశించారు. అర్హులకు కచ్చితంగా లబ్ధి జరగాల్సిందేనన్న సీఎం.. అదే సమయంలో అనర్హులు లబ్ధిపొందకూడదని హెచ్చరించారు. ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడంతో 3 లక్షల మంది అనర్హుల పేర్లు తొలగించగలిగామనీ సాంకేతికతను సరిగా వినియోగించుకోకపోవడంతోనే ఇంత పెద్ద సంఖ్యలో అనుచిత లబ్ధి పొందేవారని చెప్పారు. 99 రోజుల ప్రణాళికలో రవాణా శాఖ డాటా ఆన్‌లైన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో పాటు లారీలు, ఇతర సరకు రవాణా వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎక్కువ సంఖ్యలో డ్రైవర్లు కలుసుకునే చోట్లనే ఈ శిబిరాలు ఏర్పాటు చేసి వారికి పరీక్షలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. రహదారులపై భారీ స్థాయిలో గుంతలు, ప్రమాదం జరిగే స్థలాల వివరాలు తెలుసుకునేందుకు వాట్సాప్ నెంబర్ ను ఇవ్వాలని రవాణా శాఖను ఆదేశించారు. ఆ నంబర్‌కు వచ్చే సమాచారం ఆధారంగా అక్కడ మరమ్మతులు చేపట్టడం, ఇతర జాగ్రత్తలు తీసుకోవడం చేయాలన్నారు. ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్ల వెంట భారీగా చెత్త, ఇతర నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తున్నారన్నారు. వ్యర్థాలను తీసుకువచ్చే వాహనాలను పట్టుకొని జరిమానాలు విధించడంతో పాటు కేసులు పెట్టాలన్నారు. ఓఆర్ఆర్ ఏజెన్సీని బాధ్యులను చేయాలన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లించాలన్నారు.
పిల్లలకు పోషకాహారం అందాలనీ అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. మూడు కార్పొరేషన్లతో పాటు నగరాలు, పట్టణాల్లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, బాయ్స్, గరల్స్ హాస్టళ్ల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆయా హాస్టళ్ల ఏర్పాటుకు అనుమతులు, వాటిపై పర్యవ◌ేకేణ ఉండాలన్న సీఎం.. వాటి యాజమాన్యాలకు జవాబుదారీతనం ఉండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ–సిగరెట్ల వినియోగం జరిగితే అందుకు ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించాలనీ సీఎం స్పష్టం చేశారు. ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్, పీఈటీ ఎలా ఉంటారో అలానే సైకాలజిస్ట్ ఉండేలా చూడాలని ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు చేపట్టి సకాలంలో రైతులకు వాటి సమాచారం అందజేయాలని సీఎం సూచించారు.
ఏ భూమిలో ఏ పంట బాగా పండుతుంది అనే విషయం రైతులకు వివరించాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా అన్నదాతలను ప్రోత్సహించడంతో పాటు పంట మార్పిడి, పంటల వైవిధ్యత ప్రయోజనాలను వివరించాలని ఆదేశాలు జారీ చేశారు. యూరియా యాప్‌లో కొంత గందరగోళం ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారని సీఎం చెప్పారు. దానిని సులువుగా వినియోగించేలా మార్పులు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నానో యూరియా ఉపయోగాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శన ద్వారా రైతులకు చూపించాలని సూచించారు. వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. పంటలు వేసే మొదలు పంట ఉత్పత్తుల అమ్మకం వరకు సరైన కార్యాచరణ ప్రణాళిక ఉంటేనే ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. ఈ విషయంలో ఈ రెండు శాఖలు పరస్పర సహకారంతో ముందుకుసాగాలన్నారు. తమ జిల్లాల్లో పంటల వైవిధ్యతకు ఉన్న అవకాశాలపై నివేదిక సమర్పించాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు.

**'స్థానికం'గా ఉండాల్సిందే**
సదస్సులో పలువురు కలెక్టర్ల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది కలెక్టర్లు.. ఆయా జిల్లా హెడ్ క్వార్టర్లలో నివాసం ఉండటం లేదని.. ఈ విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్లు అంటే అదే జిల్లాలో ఉండాలని.. అక్కడి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అలా లేని వారిని సహించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. పద్ధతి మార్చుకోని కలెక్టర్లపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ సదస్సులో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక**
**అయిదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్**
**ప్రణాళిక శాఖ ఈ కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తుంది.**
**ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ**
**ఏప్రిల్ 16న మండల స్థాయిలో కార్యక్రమం**
**మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమం**
**మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమం**
**జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక**

శాఖల వారీగా 10 వివిధ థీమ్ లతో 99 రోజుల కార్యక్రమం
1. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత. ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్
2. ఆరోగ్యం, 3. అరైవ్.. అలైవ్, 4. సంక్షేమం, 5. పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6. రైతు సంక్షేమం.. వ్యవసాయం, 7. విద్య
8. యువత.. క్రీడలు, 9. మహిళలు, 10. పర్యావరణం

## హైకోర్టు ఉత్తర్వులతోనే

# ఆదిత్య బిల్డర్స్ నిర్మాణాలు

## తమపై విమర్శలకు ఖండించిన హైడ్రా

***బీఆర్ఎస్ హయాంలోనే ఆదిత్య బిల్డర్స్ కు అనుమతులు***
***మూసీలోకి జరిగి నిర్మాణాలపై హై కోర్టు ఆగ్రహం***
***రిటైనింగ్ వాల్ ను తొలగించినట్టు హైకోర్టుకు ఆదిత్య బిల్డర్స్ నివేదన***
***అనుమతులను పునరుద్ధరించిన హైకోర్టు***
***హై కోర్టు అనుమతుల మేరకే నిర్మాణాలు***

**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:**
నార్సింగిలో ఆదిత్య బిల్డర్స్ నిర్మిస్తున్న భవనాలపై హైడ్రా పై విమర్శలు వస్తుండడంతో వాటిని ఖండించి వివరణ ఇచ్చింది. బి ఆర్ ఎస్ హయాంలోనే ఆదిత్య బిల్డర్స్ కు అనుమతులు ఇచ్చారని తెలిపింది. అయితే మూసీలోకి జరిగి రిటైనింగ్ వాల్ నిర్మించడంతో అనుమతులు రద్దు అప్పటి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఆ తర్వాత కోర్టును ఆదిత్య బిల్డర్స్ ఆశ్రయించగా రిటైనింగ్ వాల్ నిర్మాణంపై పరిశీలించాలంటూ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో మూసీలో కట్టిన రిటైనింగ్ వాల్ ను తొలగించిన ఆదిత్య బిల్డర్స్. వెనక్కు జరిగి నిర్మిస్తామంటూ కోర్టుకు నివేదించారని హైడ్రా తెలిపింది.ఇరిగేషన్, రెవెన్యూ నివేదికతో పాటు ఆదిత్య బిల్డర్స్ హామీతో మళ్ళీ నిర్మాణ అనుమతులను హైకోర్టు పునరుద్ధరించిందని తెలిపారు.హై కోర్టు అనుమతుల మేరకే ప్రస్తుత నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ పరిణామాలన్నీ హైడ్రా రాక ముందు జరిగినవి అని తెలిపారు.కవిత తో పాటు ఈ విషయంలో స్పందించిన ప్రతి ఒక్కరు గమనించాలని హైడ్రా విన్నవించింది.

## పహల్గం దాడి తీగలాగితే..

# చైనాలో కదులుతోంది !

**ముద్ర డెస్క్:**
ఉగ్రవాదులు భారత్‌పై ఎప్పుడు దాడి చేసినా.. ఆ దాడి మూలాలు భారత్‌లోనే దొరికేవి. కానీ ఇప్పుడు ఆ మూలాలు చైనాతో లింక్ అయి ఉన్నాయి. పహల్గం ఉగ్రదాడి విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. విచారణ సందర్భంగా నెదర్లాండ్స్ లో తీగలాగితే చైనాలో డొంక కదిలేలా కనిపిస్తోంది. ఉగ్రదాడి వెనుక ఎవరి సహాయం ఉందన్న కీలక విషయం వెలుగులోకి రానుంది. అయితే విచారణలో చైనా సహకరిస్తుందా లేదా ? అన్నది ప్రశ్న.

**కెమెరాలో కీలక విషయం..**
పహల్గం పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో దాదాపు 25 మంది పర్యాటకులు మరణించారు. దీనికి ప్రతిచర్యగా భారత్ పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ నిర్వహించింది. ఈ దాడులకు కారకులైన వారిని మట్టుబెట్టింది. పహల్గంలో ఉగ్రదాడికి ముందే ఉగ్రవాదుల రెక్కీ, వారి కదలికలకు సంబంధించిన దృశ్యాలు గోప్రో హీరో 12 బ్లాక్ లో నిక్షిప్తమయ్యాయి. ఈ విషయాన్ని విచారణలో ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ఈ పరికరానికి సంబంధించి పూర్తీ సమాచారాన్ని సేకరించేందుకు చైనా ప్రభుత్వానికి లెటర్ రోగెటరీ పంపడానికి జమ్మూ కోర్టు ఎన్ఐఏకు అనుమతి ఇచ్చింది.

**నెదర్లాండ్స్ లో మొదలు..**
ఎన్ఐఏ మొదట నెదర్లాండ్స్ లో విచారణ మొదలు పెట్టింది. మొదట ఈ గోప్రో కెమెరా తయారీ కంపెనీని సంప్రదించింది. ఎవరికి అమ్మారు, వారి డీటైల్స్ ఏంటి, ఎలా అమ్మారు లాంటి సమాచారాన్ని సేకరించింది. గోప్రో కెమెరాను చైనాకు సంబంధించిన ఏఈ గ్రూప్ ఇంటర్నేషనల్ అనే డిస్ట్రిబ్యూటర్ సంస్థకు అమ్మినట్టు తెలిపింది. ఈ పరికరం 2024 జనవరి 30న చైనాలోని డాంగ్గువాన్ యాక్టివేట్ అయినట్టు ఎన్ఐఏ అధికారులకు సాంకేతిక ఆధారాలు లభించాయి. అయితే ఆ కెమెరా చేతులు ఎలా మారింది ?. ఎవరి వద్దకు వెళ్లింది ?. ఉగ్రవాదుల చేతులకు ఎలా వెళ్లిందన్న సమాచారం తమ వద్ద లేదని నెదర్లాండ్స్ కంపెనీ ఎన్ఐఏకు తెలిపింది.

ఎండాకాలం జాగ్రత్తలు

మధ్యాహ్న ఎండను వీలైనంత వరకు దూరంగా ఉంచాలి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 వరకు బయటకు వెళ్లడం తగ్గించాలి. అత్యవసరమైతే టోపీ, గొడుగు ఉపయోగించాలి.



# వస్తామంటే.. స్వాగతిస్తాం

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- పేదల కోసమే పోరాటం చేశాం
- నమ్ముకున్న సిద్ధాంతం కోసం మావోయిస్టులు పని చేశారు
- పాకిస్తాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోడీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



లొంగిపోయిన మావోయిస్టులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తానంటే ఆహ్వానం పలుకుతామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతానికైతే తాము ఏ మాజీ మావోయిస్టును పార్టీలో ఆహ్వానించలేదన్నారు. మంగళవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలైనా, మావోయిస్టులు అయినా పేద ప్రజల కోసమే పోరాటం చేశామన్నారు. మావోయిస్టు, తమ సిద్ధాంతాల విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని చెప్పారు. అయినా ప్రజల కోసం పోరాడిన వాళ్లపై గౌరవం ఉంటుందని చెప్పారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం మావోయిస్టులు దశాబ్దాలుగా పని చేశారని చెప్పారు. ఆపరేషన్ కగార్‌ను తాము మొదటి నుంచి వ్యతిరేకించామని చెప్పారు. అయితే పాకిస్తాన్‌తో చర్చలకు ఒప్పుకున్న మోడీ మావోయిస్టులతో చర్చలకు ఒప్పుకోలేదని ఆరోపించారు. తెలంగాణ కోసం పని చేసిన వారిని బీఆర్ఎస్ ఏనాడూ గౌరవించలేదని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ నెలాఖరులోగా కొన్ని కార్పొరేషన్ పదవులు భర్తీ చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం ఆయా పదవులపై కసరత్తు జరుగుతోందని చెప్పారు. ఖమ్మం జిల్లా వెనుగుమట్లలో భూదాన్ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు సంబంధించి కేరళ సీఎం పినరయి విజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి సమాధానం చెప్పారు. రాజకీయాల కోసమే పినరయి విజయ్ మాట్లాడుతున్నారని కౌంటర్ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో కేరళలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ తరపు నుంచి రాజ్యసభ రేసులో 16 మంది ఉన్నారని టీపీసీసీ చీఫ్ వెల్లడించారు. వీరిలో నలుగురు సమర్థులైన బీసీలు తమకు అవకాశం ఇవ్వమని అడుగుతున్నారని తెలిపారు.ఈ నెల 2న డీసీసీల శిక్షణ ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన రాహుల్ గాంధీతో రాజ్యసభ సభ్యుల గురించి 30 నిమిషాల పాటు చర్చించినట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యుల ఎంపిక కోసం ఢిల్లీ పిలుస్తామని రాహుల్ గాంధీ తమతో చెప్పారన్నారు. అయితే అగ్రనేతలు తమను ఢిల్లీకి పిలుస్తారా? ఫోన్లో చర్చిస్తారో త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అప్పుడే రాష్ట్రం నుండి ఒకరికి ఇస్తారా? లేదా ఇద్దరికి ఇస్తారా? అనేది తెలుస్తుందన్నారు. ప్రచారం జరుగుతున్నట్టు జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యసభ స్థానాన్ని అడగడం లేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు రాజ్యసభ అవకాశం ఇచ్చిందని ఆరోపించారు. తెలంగాణ కోసం పని చేసిన వాళ్ళలో ఒక్కరికీ అవకాశం ఇవ్వలేదన్నారు. శిక్షణ కార్యక్రమంలో కొందరు డీసీసీ అధ్యక్షులు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తమకు సహకరించడం లేదని ఫిర్యాదు చేసినట్లు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఫిర్యాదు అందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై రాహుల్ గాంధీ తనను దృష్టి పెట్టమని ఆదేశించారన్నారు. వెంటనే ఆయా ఎమ్మెల్యేలతో మాట్లాడిన తాను వారిని మందలించానని టీపీసీసీ చీఫ్ వివరించారు.

# మూడు వారాల్లో ముగించండి

- ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు తీర్పు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



పెండింగ్ లో ఉన్న ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. రాబోయే మూడు వారాల్లోపు ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. కౌన్సిలర్లు ఎవరి ఒత్తిడికి లోనవ్వకుండా స్వచ్ఛందంగా తమ మద్దతును తెలుపుకునేలా చర్యలు తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. ఛైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ఎన్నికల రిటర్నింగ్ అధికారిదేనని కోర్టు తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఉన్న సందిగ్ధతను తొలగించి ఎన్నికల ప్రక్రియను మూడు వారాల్లోగా పూర్తి చేసి, నూతన పాలకవర్గాన్ని ప్రకటించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో పాలకవర్గాలు కొలువుదీరిన నేపథ్యంలో.. ఇబ్రహీంపట్నంలోనూ ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఎన్నిక విషయంలో ఇంకా ఆలస్యం జరిగితే దాని ప్రభావం అభివృద్ధిపై పడుతుందని కోర్టు అభిప్రాయపడింది. ఇదిలావుంటే.. గత నెలలో మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సమయంలో 19వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల యాదగిరి కనిపించకుండా పోవడం కలకలం రేపింది. దీంతో తన తండ్రిని ప్రత్యర్థి పార్టీ నేతలు కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియపై స్టే విధించింది. అయితే, స్టే ఉత్తర్వులు వచ్చే సమయానికే ఎన్నిక ముగిసిందని, బీఆర్ఎస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి మెజారిటీ సాధించారని ఆయన తరపు న్యాయవాదులు వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను మూడు వారాల్లోపు పూర్తి చేయాలని తుది తీర్పును వెలువరించింది.

### కుటుంబ కలహాలతో..ఇద్దరు పిల్లలను చంపి...

# ఆత్మహత్యకు పాల్పడిన మహిళ

**ముద్ర ప్రతినిధి, బీబీనగర్:**



కుటుంబ కలహాలతో ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం బీబీనగర్ మండలం గొల్లగూడెంలో చోటుచేసుకుంది. బీబీనగర్ సీఐ ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... మండలంలోని గొల్లగూడెం కి చెందిన మేకల మహేష్‌కు వలిగొండ మండలం వేములకొండ కి చెందిన ఐశ్వర్య (27)తో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వారికి ఒక అమ్మాయి ఝాన్సీ (2), ఒక అబ్బాయి (11 నెలలు) ఉన్నారు. రెండేళ్ల కిందట దంపతుల మధ్య గొడవ జరగడంతో ఐశ్వర్య సంబంధీకులు మహేష్‌ను కొట్టి ఆమెను తల్లి దండ్రుల వద్దకు తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఆమె తల్లి దండ్రుల వద్దే ఉంటుంది. ఐశ్వర్య గొల్లగూడెం నుంచి తల్లి దండ్రుల వద్దకు వెళ్లేటప్పుడు తాను 4 నెలల గర్భిణి. తనను గ్రామంలో అందరి ముందు కొట్టి అవమానించారని మహేష్‌అప్పటి నుంచి భార్య పిల్లలను చూడటానికి వెళ్లలేదు. ఉద్యోగ రీత్యా వికారాబాద్ సమీపంలోని శంకర్ పల్లి లో ఉంటున్నాడు. కనీసం కొడుకు పుట్టాక కూడా అటు వైపు చూడలేదు. సోమవారం ఐశ్వర్య పెద్దమ్మ, పెద్దనాన్నలు ఐశ్వర్యను తన ఇద్దరి పిల్లలను గొల్లగూడెం తీసుకొచ్చి అత్తారింట్లో వదిలి వెళ్లారు. ఇదిలా వుండగా సాయత్రం అత్తా మామ కు భోజనం పెట్టి అందరూ తిన్నాక ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి పడుకుంది . మంగళవారం పొద్దెక్కినా కూడా ఐశ్వర్య, పిల్లలు బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె గది తలుపులు తీసి చూసే సరికి గదిలో ఆమె చీరతో ఉరి వేసుకొని , కింద చాపలో ఇద్దరు పిల్లలు విగత జీవులుగా పడి ఉన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీస్ లకు ఆమె గదిలో సూసైడ్ నైట్ స్వాధీనం లభ్యమయ్యింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



# హోలీ.. రంగుల కేళీ

- అంబరాన్నంటిన వేడుకలు
- వాడవాడలా సందడి

ముద్ర డెస్క్ :రాష్ట్రవ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్దా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి యువత డీజే పాటలకు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ.. కేరింతలు కొడుతూ వేడుకలు చేసుకున్నారు. హోలీ పర్వదినంతో వీధులన్నీ రంగులమయంగా మారి సందడి వాతావరణం నెలకొంది. రంగుల కేళి హోలీ వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హ్యాపీ హోలీ అంటూ కేరింతలు కొట్టారు.




# హైకోర్టుకు బాంబు బెదిరింపు

- ఉత్తదేనని తేల్చిన పోలీసులు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో బాంబు బెదిరింపు మెయిల్ కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి హైకోర్టును పేల్చివేస్తామంటూ మంగళవారం బాంబు బెదిరింపులు రావడంతో అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో హుటాహుటిన హైకోర్టుకు చేరుకున్నారు. కోర్టు ప్రాంగణంలో అనుమానం వచ్చిన ప్రతి వస్తువును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చివరకు ఆ బెదిరింపు ఉత్తదేనని తేల్చారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టు సిబ్బందిని, న్యాయవాదులను భద్రతా సిబ్బంది అప్రమత్తం చేశారు. న్యాయమూర్తుల ఛాంబర్లు, కోర్టు హాళ్లు, రిజిస్ట్రీ కార్యాలయంతో పాటు పార్కింగ్ ఏరియాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. తనిఖీలు పూర్తయ్యే వరకు ఎవరూ లోపలికి రావొద్దని అధికారులు సూచించారు. అవాంఛనీయ ఘటనలు, చోటచేసుకోకుండా హైకోర్టు పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.



# ‘భూదాన్’ బాధితుల పక్షాన పోరాటం

- అదే స్థలంలో ఇళ్లు కట్టించి ఇవ్వాలి
- బీసీ, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ విషాదారన్ మహరాజ్

ఖమ్మం, మార్చి 03 (తెలంగాణ కెరటం): వెలుగుమట్ల భూదాన్ భూమిలో నిరాశ్రయులైన బాధితులను అంబేద్కర్ భవన్లో బీసీ ఎస్సీ ఎస్టీ రాష్ట్ర ఛైర్మన్ విశారదన్ మహారాజు పరామర్శించినారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఇండ్లు కూల్చబడిన ప్రదేశాన్ని సందర్శించి బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని మీరు ధైర్యంగా ఉండాలని అన్నారు. బాధితులందరూ సంఘటితంగా ఉండి అన్ని పార్టీలతో ఉమ్మడి కార్యాచరణ కమిటీని వేసి నిర్వాసితులకు వెలుగుమట్లలోనే ఇల్లు కట్టించే వరకు న్యాయపరమైన ప్రజాస్వామ్య పోరాటం కొనసాగిస్తామని పోరాట కమిటీని అన్ని పార్టీల తో ఏర్పాటుచేసి పేదలకు ఇళ్లు కట్టించి వారినీ ఇళ్లలోకి పంపించేంతవరకు వెనకడుగు వేసేది లేదని బీసీ ఎస్సీ ఎస్ టి రాష్ట్ర ఛైర్మన్ విశారదన్ మహరాజ్ తెలియజేశారు. అగ్రవర్ణ ఆధిపత్యంలో బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలకు నిలువ నీడ లేకుండా చేసిన ప్రభుత్వం దోషిగా నిలబడిందని వెంటనే వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పొడకంటి రాంబాబు, ఖమ్మం జిల్లా కన్వీనర్ ములకలపల్లి సంగమేశ్వర రావు, కో కన్వీనర్లు జక్కుల రాజేష్, కటకం వెంకటలక్ష్మి, వీర్నారీ మహిళ జిల్లా అధ్యక్షులు పి ఆర్ ఆర్ దేవి, న్యాయవాదులు ధరావత్ వీరన్న, భూక్యా హరి నాయక్, కోపిల రవి, ఆంటోనీ సురేష్, కొర్లపాటి వీర రాఘవులు, నాగేశ్వరావు, నర్ల శేషయ్య ముదిరాజ్, రావుల హనుమంతరావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# శ్వేతపత్రం విడుదల చేయండి

**సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ మేరకు కిషన్ రెడ్డి మంగళవారం సీఎంకు బహిరంగ లేఖ రాశారు. అందులో కీలక అంశాలు ప్రస్తావించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టో ద్వారా ప్రజలకు ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను ఇచ్చిందన్నారు. ఈ హామీలను నమ్మిన ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలకు బదులు ఖాళీ మట్టి కుండలు ఉన్నాయంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ.. మీరిచ్చిన హామీల అమలు నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారని విమర్శించారు. రాష్ట్ర ఖజానా గురించి ఇలా మాట్లాడిన మీరే ఇటీవల ఓ సభలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ.వెయ్యి కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. మీరు మాట్లాడిన తీరు చూస్తుంటే రాష్ట్ర ఖజానా నిల్.. కాంగ్రెస్ నేతల జేబులు ఫుల్ అనేలా పరిస్థితి తయారైందని ఎద్దేవా చేశారు. అందుకే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలు తెలియాల్సి ఉందని లేఖలో పేర్కొన్నారు. కేంద్రం ఇప్పటి వరకు రూ.12 లక్షలకోట్ల నిధులు ఇచ్చిందన్న కిషన్ రెడ్డి.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని దుయ్యబట్టారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
04.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in
@mudranews
mudratv

## 4 వేదిక
Peoples Voice

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



## ఏసీబీ పట్టుకున్నా అవినీతి ఎందుకు తగ్గడం లేదు?"

తెలంగాణలో అవినీతి అంశం వస్తే ఏసీబీ చర్యలు తప్పనిసరిగా చర్చలోకి వస్తాయి. రాష్ట్రవ్యాప్తంగా లంచం తీసుకుంటున్న అధికారులను ఏసీబీ తరచుగా ట్రాప్ చేస్తోంది. గత అయిదేళ్లలో 621 మంది అధికారులపై కేసులు నమోదయ్యాయి. 519 కేసుల విచారణ పూర్తయినా, కోర్టుకు వెళ్లడానికి అవసరమైన 'ప్రాసిక్యూషన్ సాంక్షన్' లేక ఫైళ్లు సచివాలయాల్లోనే నిలిచిపోతున్నాయి.

"చిన్న లోపం ఉంది", "మరిన్ని వివరాలు కావాలి" వంటి కారణాలతో ఫైళ్లు నెలలతరబడి తిరుగుతున్నాయి. పైస్థాయి అనుమతి లేకుండా శిక్ష అమలు కష్టంగా మారుతోంది. దీంతో "ఏసీబీ పట్టుకున్నా పెద్దగా ఏమీ జరగదు" అనే భావన కొందరు అధికారుల్లో పెరుగుతోంది.

రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, ఆరోగ్య శాఖలలో లంచం లేకుండా పని జరగడం కష్టమైపోయిందనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది. ఒక కేసు తీర్పు రావడానికి 10 నుంచి 15 సంవత్సరాలు పడుతోంది. అప్పటికి అధికారి రిటైర్ అయ్యి ప్రయోజనాలన్నీ పొందేస్తాడు. అక్రమ ఆస్తులు మాత్రం కుటుంబానికి మిగులుతాయి.

అవినీతి వ్యక్తిగతంగా కాదు.. వ్యవస్థాపరంగా బలపడుతోంది. ఒకరు పట్టుబడితే మరొకరు స్థానంలోకి వస్తున్నారు. అంతర్గత సహకారం కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్షాలు ప్రభుత్వం ఫైళ్లను సీరియస్‌గా తీసుకోవడం లేదని విమర్శిస్తున్నాయి. ప్రజల్లో కూడా "ఏసీబీ పని బాగుంది... ప్రభుత్వ స్పందన బలహీనంగా ఉంది" అనే భావన ఉంది.

పరిష్కారం కోసం అలస్యాలను తగ్గించాలి. ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి ఆరు నెలల్లో కేసులు పూర్తి చేయాలి. పట్టుబడిన రోజు నుంచే సస్పెన్షన్ అమలు చేయాలి. అక్రమ ఆస్తులు స్వాధీనం చేసుకోవాలి. సేవలో ఉండగానే శిక్షపడేలా చట్టపరమైన మార్పులు అవసరం.

అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి, వ్యవస్థ పారదర్శకంగా మారాలి, ప్రజలు లంచ సంస్కృతిని ప్రోత్సహించకూడదు. వ్యక్తులను పట్టుకోవడం తాత్కాలిక పరిష్కారం. వ్యవస్థను శుభ్రపరచడం మాత్రమే దీర్ఘకాలిక పరిష్కారం.

అవినీతి రహిత తెలంగాణ ఒక నినాదం కాదు.. భవిష్యత్ తరాలకు హామీ. ప్రభుత్వం, అధికారులు, ప్రజలు కలిసి పని చేస్తేనే నిజమైన సామాజిక తెలంగాణ సాకారం అవుతుంది.




-మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

## అంధకారానంతరం వెలుగు
### : చంద్రగ్రహణం ఇచ్చే జీవన సందేశం



ఖగ్రాస గ్రాస్తోదిత చంద్రగ్రహణం విశ్వ చక్రంలో ఒక విశిష్ట దృశ్యం. విశ్వావసు నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ, మంగళవారం మార్చి 3న సంభవించిన ఈ కేతుగ్రస్త కృష్ణవర్ణ ఖగ్రాస గ్రాస్తోదిత చంద్రగ్రహణం ఆధ్యాత్మిక, ఖగోళ, శాస్త్రీయ పరంగా విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రహణ స్పర్శ కాలం పగలు 3:20కు ప్రారంభమై, సమ్మీళన కాలం 4:34కు, మధ్యకాలం 5:04కు, ఉన్మీళన 5:33కు, మోక్ష కాలం 6:48కు ముగిసింది. మొత్తం గ్రహణ పర్వకాలం 3 గంటల 33 నిమిషాలు. గ్రాస్తోదిత స్వరూపం వల్ల చంద్రుడు ఉదయించిన తరువాత కొంతసేపు గ్రహణావస్థలోనే దర్శనమిచ్చాడు. చంద్రగ్రహణం అనేది భూమి, చంద్రుడు, సూర్యుడు ఒకే రేఖలో నిలిచినప్పుడు సంభవించే సహజ ఖగోళ సంఘటన. భూమి నీడ చంద్రుడిపై పడినప్పుడు గ్రహణం ఏర్పడుతుంది. ఖగ్రాస స్థితిలో భూమి నీడ పూర్తిగా చంద్రుణ్ని ఆవరించి, కృష్ణవర్ణం లేదా రక్త వర్ణంగా కనిపిస్తుంది. దీనిని ఆధునిక శాస్త్రంలో "రక్తచంద్రుడు" అని పిలుస్తారు. భూమి వాతావరణం ద్వారా సూర్యకిరణాలు వంగి చంద్రుడిపై పడటమే ఇందుకు కారణం. గ్రాస్తోదిత అంటే చంద్రుడు ఉదయించేటప్పటికే గ్రహణం కొనసాగుతుండడం. సూర్యాస్తమయానంతరం చంద్రుడు గ్రహణావస్థలో కనిపించడం ప్రజల్లో ఆసక్తి రేకెత్తిస్తుంది.



మోక్ష కాలం వరకు మాత్రమే స్పష్టంగా దర్శనమిస్తుంది. భారతీయ జ్యోతిష్య దృష్టిలో చంద్రగ్రహణం రాహు, కేతువులతో అనుసంధానించబడింది. పురాణాల్లో సముద్ర మథన సందర్భంలో స్వర్ణభానువు శిరచ్ఛేదం తర్వాత రాహు, కేతువులుగా అవతరించాడనే కథ ప్రాచుర్యం. ఇది ఖగోళ సత్యానికి ప్రతీకాత్మక రూపమే. భూమిచంద్రసూర్య సంబంధాలను ప్రజలకు అర్థమయ్యేలా రూపకంగా వివరించిన పురాతన ఋషుల జ్ఞానం ఇందులో ప్రతిఫలిస్తుంది. గ్రహణ సమయంలో ఉపవాసం, జప, ధ్యానం, దానం శ్రేయస్కరమని ధర్మశాస్త్రాలు సూచిస్తాయి. ఫాల్గుణ పౌర్ణిమ రోజున గ్రహణం రావడం వల్ల పుణ్యకాల ప్రాధాన్యం పెరుగుతుంది. గాయత్రీ మంత్రం, మహామృత్యుంజయ మంత్రం, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం శ్రేయస్కరం అని స్మృతి గ్రంథాలు పేర్కొంటాయి. శాస్త్రీయంగా చంద్రగ్రహణం హానికరం కాదని ఆధునిక ఖగోళ శాస్త్రం స్పష్టం చేస్తోంది. సూర్యగ్రహణంలా కంటికి ప్రమాదం లేదు. ప్రత్యేక కవచాలు అవసరం లేదు. పురాతన కాలంలో ఆహారంపై సూక్ష్మజీవుల ప్రభావం ఉంటుందనే భావనతో వంట, భోజనంపై నియమాలు ఏర్పడ్డాయి. నేటి శాస్త్రం ప్రత్యక్ష హాని లేదని చెబుతున్నా, ఉపవాసం ఆధ్యాత్మిక నియమశీలతకు దోహదం చేస్తుంది. స్పర్శ నుండి సమ్మీళన వరకు చంద్రుడు క్రమంగా భూమి నీడలోకి జారుకుంటాడు. మధ్యకాలం అత్యున్నత దశ. ఉన్మీళనలో మళ్లీ వెలుగులోకి వస్తాడు. మోక్ష కాలంలో గ్రహణం పూర్తవుతుంది. 3 గంటల 33 నిమిషాల ఈ వ్యవధి ఖగోళ చలన శాస్త్రానికి జీవంత సాక్ష్యం.జ్యోతిష్య పరంగా చంద్రుడు మనసుకు అధిపతి కాబట్టి భావోద్వేగాలపై ప్రభావం ఉంటుందని విశ్వాసం. అయితే శాస్త్రీయ ఆధారాలు లేవు. ఆధ్యాత్మికంగా ఇది మనోనిగ్రహ సాధనకు అవకాశం.ఫాల్గుణ పౌర్ణిమ వసంత ఋతువు ఆరంభాన్ని సూచిస్తుంది. ఈ కాలంలో సంభవించిన ఖగ్రాస గ్రాస్తోదిత చంద్రగ్రహణం విశ్వ క్రమశిక్షణను గుర్తు చేస్తుంది. భూమి నీడలో చంద్రుడు తాత్కాలికంగా మరుగునపడినా, కొద్దిసేపటికి మళ్లీ ప్రకాశిస్తాడు. అంధకారానంతరం వెలుగు అనివార్యమనే జీవన సత్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మొత్తం మీద మార్చి 3న సంభవించిన ఈ ఖగ్రాస గ్రాస్తోదిత చంద్రగ్రహణం ఖగోళ శాస్త్రానికీ, ధార్మిక సంప్రదాయానికీ, సామాజిక ఆచారానికీ సమాన ప్రాధాన్యం కలిగిన విశేష సంఘటనగా నిలిచింది. స్పర్శ నుంచి మోక్షం వరకు సాగిన ఈ దివ్య దృశ్యం ప్రకృతి నియమాల మహత్తును మనకు గుర్తు చేస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

## నిరాడంబర జీవితానికి నిలువెత్తు నిదర్శనం సుధామూర్తి:

నిరాడంబర జీవితం, సేవా తత్వం, యువతకు స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తిత్వం సుధా మూర్తిని రాజ్యసభ వరకు చేర్చాయి. కంప్యూటర్ ఇంజనీర్‌గా ప్రారంభమైన ఆమె ప్రయాణం సామాజిక సేవకురాలిగా విస్తరించింది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా అనాథాశ్రమాలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు అందించడం వంటి సేవలు చేశారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో 'మూర్తి క్లాసికల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా' స్థాపనకు సహకరించారు. రచయిత్రిగా కూడా ఆమె విశిష్ట స్థానం సంపాదించారు.

1950లో కర్ణాటక రాష్ట్రం హావేరీ జిల్లా షిగ్గాన్‌లో జన్మించిన సుధా మూర్తి, తండ్రి ఎస్.ఆర్. కులకర్ణి వద్దనుండి క్రమశిక్షణ, తాతయ్య-అమ్మమ్మల వద్దనుండి సరళ జీవనం నేర్చుకున్నారు. "How I Taught My Grandmother to Read" వంటి రచనలు ఆమె బాల్యానుభవాల ఫలితం. బి.వి.బి. ఇంజినీరింగ్ కళాశాల, ఐఐఎస్‌సి బెంగళూరులో స్వర్ణపతకాలతో చదువులు పూర్తి చేశారు.

1974లో టెల్కోలో మహిళలకు అవకాశం లేదని వచ్చిన ప్రకటనపై జె.ఆర్.డి. టాటాకు లేఖ రాసి ఉద్యోగం సాధించారు. టెల్కోలో తొలి మహిళా ఇంజనీర్‌గా నిలిచారు. నారాయణ మూర్తితో వివాహం తర్వాత ఇన్ఫోసిస్ స్థాపనకు రూ.10,000 పెట్టుబడి ఇచ్చి, కుటుంబ బాధ్యతల మధ్య ఆయనకు వెన్నుదన్నుగా నిలిచారు. తర్వాత ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా వేలాది మందికి సేవలందించారు.

నిరాడంబర జీవనశైలి ఆమె ప్రత్యేకత. అవసరానికి మించి ఖర్చు చేయకూడదనే తల్లి బోధ, ఆకలిగొన్నవారికి మంచి బియ్యమే ఇవ్వాలన్న అమ్మమ్మ పాఠం ఆమె జీవితాంతం పాటిస్తున్నారు. ముప్పై ఏళ్లుగా చీరలు కొనకుండా బహుమతులుగా వచ్చినవే ధరించడం ఆమె సరళతకు ఉదాహరణ.

రచయిత్రిగా "Dollar Sose", "Grandma's Bag of Stories", "3000 Stitches" వంటి పుస్తకాలు రచించారు. అనేక భాషల్లో అనువాదమయ్యాయి. సామాజిక సేవకు గాను 2006లో పద్మశ్రీ, 2023లో పద్మభూషణ్ అందుకున్నారు. గ్లోబల్ ఇండియన్ అవార్డు ద్వారా లభించిన నగదును కూడా విద్యాసంస్థలకు విరాళంగా ఇచ్చారు.

"జీవితం అంటే పోరాటం. డబ్బు కాదు, ప్యాషన్ మనిషిని పైకి తీసుకెళ్తుంది" అన్న సందేశంతో సుధా మూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.







సుధాకర్.ఏ.వి * రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు * స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS) * 9000674747.

## వికసిత్ భారత్‌కు కీలకం వృత్తిపరమైన భద్రత, శ్రేయస్సు


(04 మార్చి "జాతీయ భద్రత దినోత్సవం" సందర్భంగా)

మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎస్ఎల్‌బిసి సొరంగం పనుల్లో నిమగ్నమై ప్రమాదం జరగడంతో ఎనిమిది మంది విగత జీవులు అయ్యారనే వార్త విని అందరం షాక్‌కు గురి అయ్యాం. భద్రీనాథ్ సమీపాన మంచును తొలగించే పనిలో నిమగ్నమైన 55 మంది సిబ్బంది గ్రేసియర్ విరిగిపడిన ఘటనలో 55 మంది మంచులో చిక్కుకున్నట్లు, అందులో 50 మందిని కాపాడినట్లు, నలుగురు మరణించి ఉంటారని, మరో ఐదుగురి ఆచూకీ దొరకలేదని తెలిసి విచారం వ్యక్తం చేశాం. ఈ విధమైన దుర్ఘటనలు తరుచుగా జరగడం సర్వసాధారణం కావడం సోచనీయం. ఇలా పని ప్రదేశాల్లో లేదా పరిశ్రమల్లో పని చేస్తున్న శ్రామికులు భద్రత కొరవడిన కారణంగా పలు సందర్భాల్లో ప్రమాదాలకు గురికావడం లేదా ప్రాణాలు సహితం కోల్పోవడం జరుగుతున్నది.

**జాతీయ భద్రత దినోత్సవం-2026 ఇతివృత్తం :**

పని ప్రదేశాల్లో ఇలాంటి ప్రాణాపాయ సంఘటనలను నివారించడానికి వృత్తిపరమైన భద్రత అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని భావించి 04 మార్చి 1966న నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పడటానికి గుర్తుగా 1972 నుంచి ప్రతి ఏట "జాతీయ భద్రత దినోత్సవం" లేదా "నేషనల్ సేఫ్టీ డే"ను 04 మార్చిన నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ భద్రత దినోత్సవం ఇతివృత్తంగా "భద్రత పెంపొందించడానికి అవగాహన, సాధికారత కల్పన, భద్రతలో నిమగ్నం చేద్దాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. వృత్తిపరంగా పని చేసే పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగకుండా, ప్రమాదాలు జరిగినపుడు స్వల్ప నష్టాలు కూడా నమోదు కాకుండా ఉండడానికి కార్మికులకు అవసరమైన భద్రత పట్ల అవగాహన కల్పించడం, భద్రతా చర్యలను పెంచడం, ఉద్యోగులు, పౌర సమాజానికి కనీస అవగాహన కల్పించడమే లక్ష్యంగా జాతీయ భద్రత దినోత్సవం జరుపుకోవడం కొనసాగుతున్నది. జాతీయ భద్రత దినోత్సవంతో పాటు "జాతీయ భద్రత వారోత్సవాల"(నేషనల్ సేఫ్టీ వీక్)"ను కూడా 04 మార్చి నుంచి 10 మార్చి వరకు నిర్వహిస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను సుసాధ్యం చేయడానికి వృత్తిపరమైన భద్రత కనీస అవసరం అని తెలుసుకుందాం.

వృత్తిపరమైన భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ జాగ్రత్తలు, సంబంధిత వర్గాలకు అవగాహనతో పాటు అవసర శిక్షణ కార్యక్రమాలను చర్చించడానికి జాతీయ భద్రత దినోత్సవ వేదికలు గత 55 ఏండ్లుగా ఉపయోగపడుతున్నాయి. నేటి డిజిటల్ యుగంలో పని ప్రదేశాలను సురక్షిత కేంద్రాలుగా మార్చడానికి నడుం బిగిద్దాం, స్వల్ప గాయాలు కూడా నమోదు కాని పరిస్థితులను కల్పిద్దాం.




డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**ఎండాకాలం జాగ్రత్తలు**

తేలికపాటి పత్తి బట్టలు ధరించాలి
లేత రంగుల, పలుచటి పత్తి దుస్తులు శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి.
గట్టి, డార్క్ రంగు బట్టలు వేడిని ఎక్కువగా పీల్చుకుంటాయి.

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- **డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డితో రాహుల్ గాంధీ**

**ముద్ర, నారాయణపేట :**




నారాయణపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏఐసిసి అధినేత రాహుల్ గాంధీ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డికి సూచించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక ప్రాంతంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులతో సంఘటన సృజన్ అభియాన్ శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసిసి అధినేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ తదితరులు హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పార్టీ బలోపేతం సహా ఇతర అంశాలపై దిశానిర్దేశం చేసినట్లు డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి ముద్ర ప్రతినిధికి దూరవాణి ద్వారా తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసి పార్టీని మరింత పటిష్టం చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అలాగే డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో రాహుల్ గాంధీ కొంతసేపు మాటామంతీ నిర్వహించారు.

## విద్యార్థులకు ఆర్థిక చేయూతనివ్వాలి

- **మాజీ మంత్రి హరీష్ రావు**



**ముద్ర, కాప్రా :**

పేద వైద్య విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక చేయూత నివ్వాలని మాజీ మంత్రి హరీష్ రావు సూచించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో హరీష్ రావు నివాసంలో ఏడుగురు ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేశారు. బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య విద్యార్థులకు చెక్కులు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే మొత్తం 122 మంది వైద్య విద్యార్థులకు వారి విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ఇది కేవలం దానంగా కాకుండా, భవిష్యత్ ఆరోగ్య వ్యవస్థలో పెట్టుబడిగా భావించాల్సిన అంశమని ఆయన తెలిపారు మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు దూరదృష్టి నాయకత్వంలో, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో వైద్య కళాశాలల స్థాపనతో "వైట్ కోట్ విప్లవం" సాకారమైందని, దీని ద్వారా వైద్య విద్య అవకాశాలు విస్తరించి, ప్రభుత్వ వైద్య సేవలు మరింత బలోపేతం అయ్యాయని హరీష్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్ ప్రవీణ్ ముదిరాజ్, బిఆర్ఎస్ నాయకులు మహేష్ గౌడ్, ప్రవీణ్ కరిపే పిల్లి నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోదండరాంను కలిసిన టీ-జేఏసీ బృందం



**ముద్ర, కాప్రా:**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం నాడు సకల జనుల ఐక్య కార్యాచరణతో రాష్ట్ర యావత్ ప్రజానికం కలిసికట్టుగా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకునేందుకు ఎమ్మెల్సీ కోదండరాం అధ్యక్షతన ఏర్పాటైన టీజేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. ఇట్టి సాధనలో భాగమైన ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయబోతున్న సబ్‌కమిటీలో ఉద్యమకారులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అలాగే ఎఫ్ఐఆర్ లేని ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ సౌకర్యం, ఆత్మగౌరవ గుర్తింపు కార్డు పూర్తిస్థాయిలో అమలయ్యేలా సబ్‌కమిటీ ముందు బలంగా వినిపించాలని కోరుతూ కోదండరాంను వారి నివాసంలో ఉప్పల్ నియోజకవర్గ పూర్వ టీజేఏసీ సభ్యుల బృందం కలిసింది. దీనిపై కోదండరాం సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు పూర్తిస్థాయి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ టీజేఏసీ ఉప్పల్ నియోజకవర్గ సభ్యులు ఏనుగు సీతారాం రెడ్డి, తాడూరి గగన్ కుమార్, విద్యాసాగర్ చారి, దుబ్బ కిషన్ ముదిరాజ్, బైరి భాస్కర్ గౌడ్, రవీందర్ రావు మరాట, బర్మోజు వెంకట చారి, పవన్ వజ్జ, శ్రీనివాస్ రెడ్డి సిహెచ్, వరుణ్ పగిడిపల్లి, లింగా రెడ్డి, బేరి తదితరులు పాల్గొన్నారు.

## నలుగురు అధికారుల సస్పెన్షన్

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :**



జడ్చర్ల ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళ

సోమవారం రాత్రి జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం గదిలో ఓ శవాన్ని కుక్కలు పీక్కుతిన్న సంఘటనలో నలుగురు వైద్య అధికారులపై వేటు పడింది. ఈ మేరకు హెల్త్ అండ్ ఫ్యామిలీ కమిషనర్ అజయ్ కుమార్ ఈ ఘటనపై మంగళవారం విచారణ చేపట్టి బాధ్యులైన ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంఓ హరినాథ్, ఎంఎన్ఓ రవి ప్రకాష్, డ్యూటీ డాక్టర్ మునిషాలను సస్పెండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన అందరిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆసుపత్రిలో నిర్లక్ష్యం వహించిన సిబ్బంది అందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులపై సిబ్బంది నిర్లక్ష్యం ఎక్కువైందని, ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

# ఘనంగా హోలీ సంబురాలు

**ముద్ర కూకట్‌పల్లి :**

జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జెఎన్టీయు) క్యాంటీన్ వద్ద స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో హోలీ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మంగళవారం జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగులు పూసుకుంటూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే హోలీ పండుగను వర్సిటీలో ఇంత ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు తమ జీవితాల్లో ఎదురయ్యే చెడు ఆలోచనలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన జేఎన్‌టీయూ ఉన్నతాధికారులకు మరియు కేపీహెచ్‌బీ పోలీసులకు స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాగర్ నాయక్, శ్రీను, జై రామ్, ఆనంద్, ధనుంజయ్, శ్రీకాంత్,





మోహన్, సోహన్, రామకృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**- ప్రజలతో హోలీ ఆడిన మల్లోజుల వేణుగోపాల్**

మల్కాజిగిరి : 'హోలీ హోలీ రంగ హోలీ, చెమ్మకాయ నీలవోలి, హోలీ హోలీ రంగవల్లి' అంటూ గడ్చిరోలిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ రాజకీయ ఇంచార్జ్, మాజీ నేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను దాదా అలియాస్ భూపతి హోలీ ఆడుతున్న ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మూడు రోజుల క్రితం తన సొంత గ్రామమైన పెద్దపెల్లికి మల్లోజుల వేణుగోపాల్ తన సహచరి తారతో కలిసి వచ్చి కుటుంబ సభ్యులను కలిశారు. అనంతరం మళ్లీ గడ్చిరోలికి వెళ్లారు. నలభై ఏళ్ల అనంతరం సొంత గ్రామానికి వచ్చిన ఆనందం వ్యక్తమైంది. మంగళవారం హోలీ పండుగ సందర్భంగా గడ్చిరోలిలోని ప్రజలతో మల్లోజుల వేణుగోపాల్ హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు రంగులు పూసుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## పర్వత్ నగర్ వాసులకు ఎమ్మెల్యే భరోసా



**ముద్ర, కూకట్‌పల్లి :**

కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్ నగర్ ప్రజలు ఎవరూ అధైర్యపడవద్దని, పేద ప్రజల ఇళ్లకు తానే రక్షణగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు భరోసా ఇచ్చారు. మంగళవారం ఉదయం స్థానిక మాజీ కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్‌తో కలిసి ఆయన పర్వత్ నగర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వే నంబర్ 1007లో దశాబ్దాలుగా ప్రభుత్వ అనుమతులతో నివాసం ఉంటున్న వారిని కోర్టు ఉత్తర్వుల పేరుతో కొందరు వ్యక్తులు నోటీసులు ఇస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. "పేద ప్రజల ఇళ్లను ఏదో ఒక కారణం చెప్పి లాక్కోవడం లేదా కూల్చివేయడం ఈ ప్రభుత్వానికి పరిపాటిగా మారింది" అని విమర్శించారు. స్థానిక ప్రజలు తమ ఆవేదనను ఎమ్మెల్యేకు విన్నవిస్తూ తమ వద్ద ఇంటి నంబర్లు, ఆస్తి పన్ను రసీదులు, విద్యుత్ మరియు మంచినీటి కనెక్షన్లు వంటి అన్ని ప్రభుత్వ అనుమతి పత్రాలు ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ కొందరు కుట్రపూరితంగా తమను ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పర్వత్ నగర్ నివాసితులు పాల్గొన్నారు.

## సీఎం సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి :**

మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు.. 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై, ఇతర పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

**నారాయణపేటలో..**

నారాయణపేట : హైదరాబాద్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై మంగళ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు.

# నల్లచెరువుకు పూర్వవైభవం

- **కూకట్‌పల్లిలో పర్యావరణ విప్లవం**
- **హైడ్రా కృషితో మారిన చెరువు రూపురేఖలు**

**ముద్ర, కూకట్‌పల్లి:**




ఒకప్పుడు కూకట్‌పల్లి గ్రామ దాహార్తిని తీర్చి, పాడిపంటలకు జీవనాధారంగా నిలిచిన నల్ల చెరువు కాలక్రమేణా ఆక్రమణలు, మురికినీరు, చెత్తాచెదారంతో నిండిపోయి ప్రాభవాన్ని కోల్పోయింది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ దిశగా తీసుకున్న నిర్ణయాలతో ఈ చెరువు నేడు సుందరమైన పర్యాటక ప్రదేశంగా రూపుదిద్దుకుంది.

**నాడు మురుగుకూపం.. నేడు సుందర వనం..**

గత దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురై దుర్వాసనతో నిండిపోయిన నల్లచెరువును హైడ్రా ఆధ్వర్యంలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన శుద్ధి చేసింది. చెరువులోని పూడికను తొలగించి, చుట్టూ ఆహ్లాదకరమైన పార్కు, ఆధునిక నడక మార్గాన్ని నిర్మించింది. ఈ మార్పును వీక్షించేందుకు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ చెరువును సందర్శించి, అక్కడ వ్యాయామం చేస్తున్న స్థానికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా స్థానికులు బండి రమేష్‌తో మాట్లాడుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. "నల్లచెరువు ఇంత సుందరంగా మారుతుందని మేము కలలో కూడా ఊహించలేదు. రేవంత్ రెడ్డి పాలనలో అద్భుతమైన మార్పులు కనిపిస్తున్నాయి. పర్యావరణంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ అభినందనీయం" అంటూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. "గత పాలనలో నిర్లక్ష్యానికి గురైన నీటి వనరులను పునరుద్ధరించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే మా లక్ష్యం. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం" అని ధీమా వ్యక్తం చేశారు.

**పెద్ద ఎత్తున తరలివచ్చిన శ్రేణులు..**

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా విభాగం నేతలు, యువ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మైనారిటీ, ఎస్సీ, బీసీ విభాగాల ప్రతినిధులు, సేవాదళ్ కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో చోరీ కేసు ఛేదన

- **ఏడు తులాల బంగారం స్వాధీనం**

**ముద్ర, శేరిలింగంపల్లి :**




మదీనగూడలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రిలో రోగుల సహాయకుల అజాగ్రత్తను ఆసరాగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న మహిళను మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. మియాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం, చందానగర్ శివాజీ నగర్‌కు చెందిన జె. దుర్గ (45) అనే మహిళ అదే ఆసుపత్రిలో హౌస్‌కీపింగ్ సిబ్బందిగా పనిచేస్తూ, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఈ నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. గత నెల ఫిబ్రవరి 25న చందానగర్ అపర్ణ హిల్ పార్క్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన భార్య చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. ఆమె ఎస్ఐసీయూలో ఉండగా, ఆయన గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో నిందితురాలు రాత్రి 8.51 నుంచి 8.56 గంటల మధ్య గదిలోకి ప్రవేశించి, బ్యాగులో భద్రపరిచిన 3 తులాల గొలుసు, 3 తులాల గాజులు, ఒక తులం చెవి రింగులు, అలాగే 3 తులాల వెండి వస్తువులను అపహరించింది. మరుసటి రోజు ఉదయం బాధితుడు తన వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు, డీఐ రమేష్ నాయుడు నేతృత్వంలో ఆసుపత్రిలోని సీసీటీవీ కెమెరా దృశ్యాలను పరిశీలించారు. నిందితురాలు అనుమానాస్పదంగా గదిలోకి వెళ్లడం, విధి ముగిసిన తర్వాత భద్రతా సిబ్బందికి తన సంచిని చూపించకుండా తనిఖీలను తప్పించుకోవడం కెమెరాల్లో రికార్డు అయింది. సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు ఆమెను నివాసంలోనే అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆమె తన నేరాన్ని అంగీకరించింది.

**- స్వాధీనం చేసిన సొత్తు**

నిందితురాలి వద్ద నుంచి సుమారు ఏడు తులాల బంగారు ఆభరణాలు, 2.5 తులాల వెండి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును వేగంగా ఛేదించి బాధితులకు న్యాయం చేసిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

**- ప్రజలు, ఆసుపత్రి యాజమాన్యాలకు సూచనలు**

ఆసుపత్రులకు వచ్చేటప్పుడు విలువైన ఆభరణాలు, భారీ నగదు వెంట తీసుకురావద్దు. ఆసుపత్రి యాజమాన్యాలు తమ సిబ్బందిపై నిఘా ఉంచాలి. సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలి.
ఏదైనా అనుమానాస్పద వ్యక్తి లేదా సంఘటన కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



## స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

**ముద్ర, కూకట్‌పల్లి :**

హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని ఓ ప్రముఖ స్పా సెంటర్‌ను లక్ష్యంగా చేసుకుని పోలీసులు మంగళవారం మెరుపు దాడి నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఈ సోదాలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. స్పా సెంటర్ నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన పోలీసులు, వారిపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. నిర్వాహకులు, సిబ్బంది, ఇతరులతో కలిపి మొత్తం 20మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా స్పా నడపడం, అనైతిక కార్యకలాపాలకు పాల్పడటం వంటి కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. స్థానికంగా నిబంధనలు అతిక్రమించి నడుస్తున్న ఇలాంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని తెలిపారు.

**ఎండాకాలం జాగ్రత్తలు**

ఎండాకాలం జాగ్రత్తలు
చల్లని పానీయాలు కాకుండా
సహజ ద్రావణాలు తీసుకోవాలి
సోడాలు, గ్యాస్ డ్రింక్స్ తగ్గించాలి.
మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం
వంటివి శరీరానికి శక్తినిస్తాయి.

# టెండర్లు రద్దు చేసి అభివృద్ధి అడ్డుకోవటం శోచనీయం

- **బీజేపీ నేత రావుల రాంనాథ్ ధ్వజం**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

నిర్మల్ పట్టణంలోని 42 వార్డుల్లో అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను టెండర్లు రద్దు చేసి ఒక వర్గం వారి కొమ్ము కాసేందుకు యత్నం చేయటం శోచనీయమని బీజేపీ సీనియర్ నేత రావుల రాంనాథ్ విమర్శించారు. ఈ మేరకు ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రి తో మాట్లాడి నిర్మల్ మున్సిపల్ అభివృద్ధికై ₹.50 కోట్లు నిధులను కోరిన నేపథ్యంలో₹.15 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అధికారులతో సమీక్షించి 42 వార్డులలో అక్కడి అవసరాలను బట్టి నిధులు కేటాయించారని, టెండర్లు సైతం పూర్తయ్యాయని అన్నారు. ఐతే ఇటీవల నిర్వహించిన మున్సిపల్ అత్యవసర సమావేశంలో ఈ టెండర్లు రద్దు చేసి, ఒక వర్గానికి చెందిన పండగ కోసం సౌకర్యాల కల్పనకు మళ్ళించే యత్నం చేయటాన్ని భారతీయ జనతా పార్టీ ఖండిస్తుందన్నారు. ఈ విషయమై కలెక్టర్ కు స్థానిక మున్సిపల్ చైర్మన్ పై ఫిర్యాదు చేసినట్లు వివరించారు. నిర్మల్ పట్టణ అభివృద్ధికి, త్రాగు నీటి కోసం కేంద్ర ప్రభుత్వం నుండి ₹.62.50 కోట్లు, మురికి నీటి శుద్ధి కోసం ₹.42 కోట్లతో ఎస్ టి పి ప్లాంట్ల మంజూరుకు కృషి చేశారని అన్నారు. మెజార్టీ ప్రజల సౌకర్యాలను పక్కన పెట్టి, మైనార్టీ వర్గ సంక్షేమానికి యత్నించటం సిగ్గు చేటన్నారు. ఈ మీడియా సమావేశంలో కౌన్సిలర్లు గంజి రాజు, ఖమ్మం సురేందర్, సాదం అరవింద్, వొడిసెల అర్జున్, నరేష్, సాత్విక్, సూరజ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా హోలీ సంబరాలు

- **పాల్గొన్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ముద్ర, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ పట్టణంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. హోలీ వేడుకల్లో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు. కార్యకర్తలు, అభిమానులతో కలిసి వారు నృత్యాలు చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్బంగా రంగులు పూసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే తొలుత ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి ఆయనతో నృత్యం చేసి పోలీసుల్లో పండగ ఉత్సాహం నింపారు. ప్రేమ, ఐక్యతకు ప్రతీకగా నిలిచే హోలీ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం నింపాలని వారు ఆకాంక్షించారు. దేశ ప్రజలు ఒక్కటిగా నిలబడి, సామరస్యంతో ముందుకు సాగితే భారత్ ప్రపంచానికి మార్గదర్శక దేశంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# వేములవాడలో పిచ్చి కుక్క స్వైర విహారం

- **25 మందికి గాయాలు**

**ముద్ర, వేములవాడ:**

వేములవాడ పట్టణంలో మంగళవారం ఉదయం ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో సంచరించి సుమారు 25 మందికి పైగా పట్టణ ప్రజలను గాయపరిచినట్లు సమాచారం. గాయపడిన వారిలో రాజన్న భక్తులు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడిన వారు ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమతఅజయ్ లు ఏరియా ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ కుక్క దాడిలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందుతుందని, మున్సిపల్ పరిధిలో కుక్కల బెడదను తీర్చే క్రమంలో 15రోజుల క్రితమే 40 కుక్కలను ఏ.బి.సి కేంద్రానికి తరలించామని, కుక్కలను అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, పట్టణ ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు.





## అనారోగ్యంతో నెమలి.. ఫారెస్ట్ అధికారులకు అప్పగింత

**ముద్ర, పెద్దపల్లి:**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామ శివారులోని ఆనందం అనే రైతు పొలం వద్దకు మంగళవారం వెళ్లాడు. పొలంలో అనారోగ్యంతో ఉన్న నెమలిని గమనించాడు. దగ్గరికి వెళ్లిన అక్కడి నుంచి అది కదలలేదు. దీంతో రైతు మరి కొంత మంది రైతులకు చెప్పగా వారు వచ్చి చూశారు. అనారోగ్య సమస్య ఉండడంతో ఎగర లేకపోతుందని గ్రహించి తాగునీరు, దాన పెట్టారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు రావడంతో రైతులు వారిని నెమలిని అప్పగించారు. నెమలిని చూడడానికి గ్రామస్తులతో పాటు పలువురు వచ్చి దగ్గర నుంచి చూశారు. తాగునీరు, దాన పెట్టిన రైతులు ఆనందం, రాజు, సునీతలను ఫారెస్ట్ అధికారులు అభినందించారు.

# జిల్లా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

- **డీసీహెచ్ఎస్ డాక్టర్ కొండ శ్రీధర్**

**ముద్ర, పెద్దపల్లి:**

జిల్లా ఆస్పత్రి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేస్తున్నట్లు డాక్టర్ కొండా శ్రీధర్ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలోని తన చాంబర్ గత ఫిబ్రవరిలో అందిన వైద్య సేవల వివరాలను మీడియాకు మంగళ వారం వెల్లడించారు. 22,447 మంది ఔట్ పేషెంట్లు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందగా, ఇందులో 9,758 మంది జనరల్ మెడిసిన్ విభాగంలో, 660 మంది జనరల్ సర్జరీ విభాగంలో, 4263 మంది చిన్న పిల్లల విభాగం, 3364 మంది గైనిక్ విభాగం, 410 మంది ఆర్థో విభాగం, 1509 మంది కంటి విభాగం, 675 మంది ఈఎన్‌టీ విభాగం, 1039 మంది చర్మ విభాగం, 574 మంది దంత విభాగంలో వైద్య సేవలు పొందారని వివరించారు. అదే విధంగా 1872 మంది ఇన్ పేషెంట్లుగా వైద్య సేవలు పొందగా, ఇందులో 849 మంది జనరల్ మెడిసిన్ విభాగం, 50 మంది జనరల్ సర్జరీ విభాగం, 433 మంది చిన్న పిల్లల విభాగం, 273 గైనిక్ విభాగం, 90 మంది ఆర్థో విభాగం, 174 మంది కంటి విభాగంలో ఇన్ పేషెంట్ వైద్య సేవలు పొందారని తెలిపారు. 54 ఆర్థో శస్త్ర చికిత్సలు, 81 జనరల్ సర్జరీ శస్త్ర చికిత్సలు, 164 కంటి శస్త్ర చికిత్సలు, 25 చెవి ముక్కు, గొంతు శస్త్ర చికిత్సలు, 409 డెంటల్ శస్త్ర చికిత్సలు అయినట్లు తెలిపారు. అలాగే 184 డెలివరీలు, 27,859 ల్యాబ్ టెస్టులు, 2062 అల్ట్రా సౌండ్ స్కానింగ్, 133 టిఫ్ఫా స్కానింగ్, 722 ఈసీజీ, 255 2డీ ఎకో, 1880 ఎక్స్ రే, 724 ఫిజియో థెరపీ, దాదాపు 700 నవజాత శిశువులకి ట్రీట్మెంట్, 308 ఆరోగ్య శ్రీ సేవలు, 8 లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, 1 యూరాలజీ శస్త్ర చికిత్స, 9 రూట్ కెనాల్ శస్త్ర చికిత్సలు చేసినట్లు వెల్లడించారు. జిల్లా ప్రభుత్వ దవాఖానలో అందుతున్న అన్ని రకాల వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. వైద్య సేవలలో రోగులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు.

# విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

**ముద్ర, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అన్నారం గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు సమ్మిరెడ్డి ఇంట్లో శారద, అంజలి అద్దెకు ఉంటున్నారు. మంగళవారం వీరు పొలం పనులకు వెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో క్షణాల్లోనే ఇంటికి మంటలు వ్యాపించాయి. గ్రామస్థులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. అప్పటికే ఇంట్లో సామగ్రి , దుస్తులు, బంగారం, వెండి, ఆభరణాలు దగ్ధమయ్యాయి. వీటి విలువ సుమారు రూ. 6 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఎస్సై రాజశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుకున్నారు.



## సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో

- **రోడ్ సేఫ్టీ ఛాంపియన్ షిప్ పోటీలు**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రహదారి భద్రత ఛాంపియన్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ దర్శనం భోజన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. క్విజ్, ఉపన్యాస, వ్యాస రచన, చిత్రలేఖనం, కథలు, స్కిట్, కార్టూన్స్, ఏకపాత్రాభినయం వంటి అంశాలపై పోటీలు నిర్వహించి ఫోటోలు, వీడియో లు అప్లోడ్ చేయాలన్నారు. అలాగే ప్రసార మాధ్యమాల్లో తమ కార్యక్రమాలకు సంబంధించి ప్రచురితమైన వార్తలను అప్లోడ్ చేయాలన్నారు. ఈ నెల 14 లోగా కార్యక్రమాలను https://sarvejanafoundation.org లింక్ ద్వారా అప్లోడ్ చేయవచ్చన్నారు.

# వైభవంగా నరసింహుని డోలోత్సవం

**ముద్ర, ధర్మపురి:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం యోగ నరసింహుని డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా సూర్యోదయానికి ముందే స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు బ్రహ్మ పుష్కరిణిలోకి స్వామివారిని తీసుకొచ్చి డోలోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# పుష్కరాల కోసం భద్రత ఏర్పాట్లు

**ముద్ర, పెద్దపల్లి:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్, గోదావరిఖని సబ్ డివిజన్ అంతర్గత పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్, గోలివాడ, గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గోదావరి బ్రిడ్జ్ సమీపంలోని గోదావరి పుష్కర ఘాట్‌లను పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి సందర్శించి పరిశీలించారు. గోదావరి తీర ప్రాంతాల్లో పుష్కరాలు ఏర్పాట కోసం తీసుకుంటున్న చర్యల ఏర్పాట్ల పై పూర్తి స్థాయి కార్యచరణ రూపొందించాలని మంగళవారం పలు సూచనలు చేశారు. గోదావరి తీరంలో అధిక సంఖ్యలో భక్తులు పుష్కర స్నానాలు ఆచరించే అవకాశం ఉందని ఘాట్‌ల వద్ద భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, బ్యారికేడింగ్, సీసీ కెమెరాల పనితీరు, లైటింగ్ సౌకర్యం, పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులు వంటి అంశాలను డీసీపీ సవివరంగా పరిశీలించారు. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు, చిన్నారులు పుష్కర స్నానాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, అత్యవసర పరిస్థితుల కోసం కంట్రోల్ రూమ్, ఘాట్ పరిసరాల్లో శుభ్రత, భక్తులు సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో పుష్కర ఘాట్‌లను వినియోగించుకునేలా అన్ని శాఖల సమన్వయం తో సమగ్ర ప్రణాళిక రూపొందించి పని చేయాలని అధికారులకు డీసీపీ స్పష్టం చేశారు. డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు, అంతర్గం ఎస్ఐ వెంకట్ పాల్గొన్నారు.





# బేటి బచావో బేటి పడవో

- **ఆడబిడ్డకు రవీందర్ సింగ్ భరోసా**

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ 58వ డివిజన్ లో పుట్టే ప్రతి ఆడపిల్ల నా మనుమరాలుతో సమానం అని వారి చదువు కోసం తన వంతు సహాయంగా రూ. 10,000లు వారి పేరుపై ఫిక్స్ డ్ చేస్తా అని ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చాడు. నాయీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన జనగామ రాజేశ్వరిదత్తాత్రేయకు మనుమరాలు పుట్టిన విషయం తెలుసుకున్న రవీందర్ సింగ్ వారి కుటుంబానికి రూ.10,000లు ఆర్ధిక సహాయం మాజీ కార్పొరేటర్ కమల్జీత్ కౌర్ సోహన్ సింగ్ దంపతులచే అందించారు.

# బైక్ దొంగల అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు..


**ముద్ర, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లికి చెందిన మిరిదొడ్డి కిషన్ బైక్‌ను దొంగిలించిన బొప్పాపూర్, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన గుగ్గిల నరేష్, బొడ్డు నిఖిల్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్ రెడ్డి తెలిపారు. ఎస్ ఐ తెలిపిన ప్రకారం.. గత నెల 24 న గొల్లపల్లి గ్రామానికి చెందిన మిరిదొడ్డి విష్ణు తన ఇంటిముందు నిలుపుకున్న ద్విచక్ర వాహనం దొంగతనానికి గురైంది. దీంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. బొప్పాపూర్ గ్రామానికి చెందిన గుగ్గిళ్ళ నరేష్, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు నిఖిల్‌లు బైక్ దొంగిలించినట్లు గుర్తించి ఇద్దరిని అరెస్ట్ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని ఎస్ ఐ తెలిపారు. గుగ్గిళ్ళ నరేష్ గతంలో గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగతనం చేసి జైలుకు వెళ్లి వచ్చాడని, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బొడ్డు నిఖిల్ ఎల్లారెడ్డి పేటలోని అశ్విని ఆసుపత్రిలో ఫోన్ దొంగిలించిన కేసులో జైలుకు వెళ్లి వచ్చాడని ఎస్ ఐ తెలిపారు. జైలునుండి వచ్చిన ఇరువురు గొల్లపల్లిలో బైక్ దొంగిలించగా వారిని అరెస్ట్ చేసి బైక్‌ను స్వాధీనం చేసుకొని ఇరువురిని సిరిసిల్ల మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ ఐ రాహుల్ రెడ్డి తెలిపారు.



**ఎండాకాలం జాగ్రత్తలు**

పండ్లు ఎక్కువగా తీసుకోవాలి



పుచ్చకాయ, దోసకాయ, మామిడి లాంటి నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లు శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతాయి.

# అంబరాన్నంటిన హోళీ సంబరాలు

**ముద్ర, భువనగిరి ప్రతినిధి:**

యాదాద్రి భువనగిరి జిల్లాలో మంగళవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచే కూడళ్లలో కామదహనం చేసి రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. భువనగిరి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు హోలీ వేడుకలు నిర్వహించారు. అనంతరం వినాయక చౌరస్తా మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బైక్‌నడుపుతూ పట్టణ ప్రజలకు అభివాదం చేస్తూ అన్ని వార్డులలో తిరిగారు. కార్యకర్తలతో కలిసి రంగులు జల్లుతూ, బ్యాండ్ మేళా మధ్య డాన్సులు చేస్తూ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలుపుతూ మన సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవని, ప్రతీ పండగకు ఒక పరమార్థం ఉంటుందన్నారు. హోలీ అన్ని రంగుల కలయిక అని, సామరస్య వాతావరణంలో సంతోషంగా సంబరాలు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పట్టణ పార్టీ అధ్యక్షులు కూర వెంకటేశ్, నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, కాంగ్రెస్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.





**బీబీనగర్ లో..**

**ముద్ర ప్రతినిధి, బీబీనగర్:**

బీబీనగర్ మండల కేంద్రంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి బీబీనగర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి హోలీ వేడుకలు చేసుకున్నారు. కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులపై రంగులు చల్లుకుంటూ, మిఠాయిలు పంచుతూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ వార్డు సభ్యులు, పార్టీ మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

## చంద్ర గ్రహణం సందర్భంగా స్వర్ణగిరి ఆలయం మూసివేత



**ముద్ర, భువనగిరి ప్రతినిధి:**

కేతుగ్రస్త చంద్ర గ్రహణం సందర్భంగా భూలోక వైకుంఠంగా ప్రసిద్ధిగాంచిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఆలయ నియమావళి ప్రకారం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఉదయం త్రికాల ఆరాధనలు, నిత్య పూజలు, నివేదనలు సమగ్రంగా నిర్వహించుకొని ఉదయం 8.00 గంటలకు ఆలయ కవాట బంధనం ఆలయ తలుపుల మూసివేశారు. అనంతరం బుధవారం ఆలయ శుద్ధి కార్యక్రమాలు, పుణ్యాహవచనం, సంప్రోక్షణాది వైదిక క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించబడి సమస్త కార్యక్రమాలు పూర్తయిన తరువాత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి భక్తులకు శ్రీ వారి దర్శన భాగ్యం కల్పించబడుతుందని ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు తెలిపారు.

## కళ్యాణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

ఈ నెల 8న జరిగే భువనగిరి మండలంలోని నమాత్ పల్లి గ్రామంలో గల సుదర్శన శ్రీ పూర్ణగిరి లక్ష్మి నరసింహ స్వామివారి కళ్యాణ ఆహ్వాన పత్రికను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఆలయ చైర్మన్ రావి సురేందర్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు జ్యోషి పవన్ కుమార్ శర్మ, ఆలయ ధర్మకర్తలు సురపంగ పద్మ నర్సింహా, యాదవ్, పబ్బతి ఉప్పలయ్య, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎల్లంల జంగయ్య, రావి సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి



**ముద్ర, కోదాడ:**

రాష్ట్ర సాధన కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఉద్యమకారులకు గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సూర్యాపేట జిల్లా నూతన అధ్యక్షుడు గుండెపంగు రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం కోదాడలో ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం కోసం జిల్లాలో ఎంతోమంది ఉద్యమకారులు జైలు జీవితం గడిపారని వారి సంక్షేమం కోసం ఈ ఫోరం కృషి చేస్తుందని తెలిపారు. డాక్టర్ శ్రీనివాసరావు తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించారని కొనియాడారు. ఉద్యమ కాలంలో జిల్లా వ్యాప్తంగా రహదారుల దిగ్బంధం, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హామీలు నెరవేర్చేంతవరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ నాయకులు మట్టపల్లి శ్రీనివాస్ గౌడ్, తోటపల్లి నాగరాజు రావు, ఆవుల రామారావు, అంజయ్య, కుడుముల రాంబాబు, యేసు, రవి శంకర్, రాజు పాల్గొన్నారు.

# చెరువులు నిండేలా చర్యలు

**కాల్వలను సందర్శించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**ముద్ర, భువనగిరి ప్రతినిధి:**

ఆలేరు మండలం శారజిపేట, గోలనుకొండ ప్రాంతాల్లోని కాల్వలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం పరిశీలించారు. అశ్వారావుపల్లి నుంచి వచ్చే కాల్వల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. శారజిపేట, గోలనుకొండ గ్రామాల చెరువులు నిండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి సౌకర్యాల అభివృద్ధి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటుందన్నారు. కాల్వలు మరమ్మతు చేయడం ద్వారా నీటి ప్రవాహం సక్రమంగా జరుగుతుందన్నారు. కాల్వలను పునరుద్ధరిస్తే శారజిపేట, గోలనుకొండ గ్రామాల చెరువులు నిండి రైతులకు సాగునీరు అందుతుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల విజ్ఞప్తి మేరకు తక్షణ చర్యలు తీసుకుంటున్నామని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



# నిట్‌లో విద్యార్థుల మధ్య ఘర్షణ



**ముద్ర, హనుమకొండ:**

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లో విద్యార్థులు ఘర్షణకు దిగారు. నిట్ క్యాంపస్‌లో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ మరిచిపోకముందే మరో ఘటన చోటు చేసుకోవడం కలకలంరేపింది. స్ప్రింగ్‌స్ప్రీలో భాగంగా జరిగిన ఈవెంట్ కారణంగా విద్యార్థులు కొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా, విద్యార్థులు క్యాంపస్‌లో కొట్టుకోవడం కామన్ అయిపోయింది. ఇప్పటికే కాకతీయ యూనివర్సిటీలో చికెన్ లొల్లి మరిచిపోకముందే నిట్ క్యాంపస్‌లో విద్యార్థులు గొడవకు దిగారు. తన వీడియో తీశాడని వచ్చిన చిన్నపాటి గొడవ తారాస్థాయికి చేరింది. వివరాల్లోకి వెళితే.. నిట్‌లో స్ప్రింగ్‌స్ప్రీలో భాగంగా జరిగిన ఈవెంట్‌లో భాగంగా ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి నా వీడియో తీశావ్ ఫోన్ చూపించమని అడిగితే నేను వీడియో తీయలేదని చూపించకుండా దాటవేసినట్లు తెలుస్తోంది. రెండు, మూడురోజులుగా ఆ విద్యార్థి వీడియో చూపించకుండా సతాయించడంతో మంగళవారం అడగడానికి ఆ విద్యార్థి హాస్టల్‌కు వెళ్లగా నేను నీ వీడియో తీయలేదని, ఫోన్ చూపించకపోవడంతో మాటమాట పెరిగి ఇద్దరు విద్యార్థులుకొట్టుకున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న నిట్ అధికారులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. కాజీపేట పోలీసులు సైతం అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. విద్యార్థులు ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులందరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ ఘర్షణకు దిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిట్ క్యాంపస్‌లో విద్యార్థులు మద్యం సేవిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**పోలీసులు వేధింపులు మానుకోవాలని..**

# అడ్తి వ్యాపారుల ఆందోళన

**ముద్ర, వరంగల్:**

వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 8 గంటలకు అడ్తి వ్యాపారులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పోలీసులు వేధింపులు మానుకోవాలని నినదించారు. దీంతో మార్కెట్‌లో రెండు గంటల పాటు వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు నిలిచిపోగా, ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 8 గంటలకు అడ్తి వ్యాపారులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పోలీసులు వేధింపులు మానుకోవాలని నినదించారు. దీంతో మార్కెట్‌లో రెండు గంటల పాటు వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు నిలిచిపోగా, ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చాంబర్ పరిధిలోని సూర్యతేజ అడ్తి వ్యాపారి కొడిమల్ల కుమారస్వామి జయశంకర్‌భూపాలపల్లి జిల్లా గిద్దెముత్తారం గ్రామానికి చెందిన రాజునాయక్‌కు రూ.50 వేలు వ్యవసాయ పెట్టుబడికి అప్పుగా ఇచ్చాడు. దీంతో అతడు సూర్యతేజ అడ్తిద్వారా ఒకసారి 8 బస్తాలు, మరో మూడుసార్లు 7, 5, 3 బస్తాల చొప్పున విక్రయించాడు. ఇటీవల భూపాలపల్లి జిల్లా పరిధిలో మిర్చి బస్తాలను రాజునాయక్ చోరీ చేసి అమ్మినట్లు తేలడంతో అతడిపై కేసు నమోదు కాగా పోలీసుల విచారణలో సూర్యతేజ అడ్తి ద్వారా అమ్మినట్లు వెల్లడైంది. దీంతో పోలీసులు సంబంధిత అడ్తి వ్యాపారిని వేధింపులకు గురి చేస్తున్నారని రవీందర్‌రెడ్డి తెలిపారు. దీనిపై తాను డీఎంవో, మార్కెట్ సెక్రటరీ పోలీసులకు ఫోన్ చేసినా ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. తాము లైసెన్స్ తీసుకొని వ్యాపారం చేస్తున్నామని, రైతుల సరుకును మార్కెట్ అధికారులు నిర్ధారిస్తే తాము సులువుగా విక్రయిస్తామన్నారు. రైతులు తెచ్చిన సరుకు అసలుదా? లేక దొంగదా? అనేది తాము నిర్ధారించలేమన్నారు. పోలీసుల వేధింపుల నుంచి అడ్తి వ్యాపారులను రక్షించాలని ఆయన కోరారు. దీనిపై జిల్లా మార్కెటింగ్ అధికారి కలకోట సురేఖ, ఎనుమాముల మార్కెట్ కార్యదర్శి మల్లేశం స్పందించి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణుడు, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీభాయి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వారు సంబంధిత పోలీసు అధికారిపై చర్యలు తీసుకొని మార్కెట్ బైలా ప్రకారం అడ్తి వ్యాపారికి ఎలాంటి సంబంధం లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఉదయం 10 గంటలకు వ్యాపారులు ధరలు నిర్ణయించి కాంటాలు నిర్వహించారు. దీంతో రెండు గంటలకు పైగా కాంటాలు ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.



## ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చడమా.?

**తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్**

**ఖమ్మం, ముద్ర :**



ఇండ్లు కూల్చుడేనా ఇందిరమ్మ రాజ్యమంటే? ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చుడేనా? అని రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ప్రశ్నించారు. సోమవారం ఖమ్మం విచ్చేసిన ఆయన వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కాంగ్రెస్ సర్కారు కూల్చిన పేదల ఇండ్ల ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి నుంచి నగరంలోని టీటీడీసీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనాల్లో తలదాచుకుంటున్న బాధితుల వద్దకు వెళ్లి పరామర్శించారు. అక్కడి నుంచి నగరంలోని టీటీడీసీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనాల్లో తలదాచుకుంటున్న బాధితుల వద్దకు వెళ్లి పరామర్శించారు. దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న అభాగ్యులతో మమేకమై జరిగిన ఘటనల గురించి ఆరా తీశారు. మీరు అధైర్యపడకండి, యావత్ తెలంగాణ సమాజం అం డగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విధ్వంసమైన గాజా పట్టణం ఖమ్మంలోని వెలుగుమట్ల వినోభాబావే నవోదయ కాలనీలో కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లను ప్రత్యక్షంగా చూస్తే కరగని మనస్సు ఉండదని చెప్పిన ఆయన భావోద్వేగానికి గురయ్యారు. ఎనిమిదేండ్ల క్రితం కూలీ నాలీ చేసుకుని సంపాదించుకున్న పదో పరకో పెట్టి ఒక చిన్న గూడు కట్టుకుంటే నేలమట్టం చేయడం అన్యాయమని ధ్వజమెత్తారు. పేదల ఉసురు తగిలిన ఏ ప్రభుత్వమూ నిలబడజాలదనే సత్యాన్ని ప్రస్తుత పాలకులు గుర్తుంచుకోవాలని హిత వు పలికారు. అనేక పోరాటాలు, త్యాగాలతో రాష్ట్రాన్ని తెచ్చుకుంది పేదల ఇండ్లను కూల్చడానికా? అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణను దేశానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుకుని పునర్నిర్మించుకునే సమయంలో ప్రభుత్వం నాగరిక సమాజం తలదించుకునేలా తప్పు చేసిందన్నారు. ఎలాంటి భేషజాలు లేకుండా ఎక్కడైతే పేదల ఇండ్లను నేలమట్టం చేశారో, అక్కడే వారికి పట్టాలు ఇచ్చి పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సామాజిక కార్యకర్త కోయ చంద్రమోహన్ , పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కంటైనర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

**యాదాద్రి, ముద్ర:**

భువనగిరి జిల్లా చౌటుప్పల్ సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. ఆగివున్న కంటైనర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం ధ్వంసమవ్వగా.. 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఉదయం చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆగివున్న కంటైనర్‌ను ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సు నిడదవోలు నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బస్సు ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 04.03.2026
www.mudranews.in | @mudranews



**ఎండాకాలం- జాగ్రత్తలు**

సన్‌స్క్రీన్ ఉపయోగించాలి
బయటికి వెళ్లే ముందు ఎస్ పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ రాసుకోవడం చర్మాన్ని రక్షిస్తుంది. నేరుగా సూర్య కిరణాల ప్రభావం తగ్గుతుంది.



# హోలీ.. రంగుల కేళీ

**- వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్, ఎస్పీ, మాజీ కలెక్టర్, చైర్ పర్సన్**



హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్



పోలీస్ సిబ్బందితో కలిసి సంబరాల్లో పాల్గొన్న ఎస్పీ, అదనపు ఎస్పీ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
జిల్లా వ్యాప్తంగా మంగళవారం హోలీ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు, యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ హోలీ సంబరాలు జరుపుకున్నారు. యువకులు బైకులపై తిరుగుతూ మిత్రులకు రంగులు చల్లారు.

### క్యాంపు కార్యాలయాల్లో..

కలెక్టరేట్, అందనపు కలెక్టర్ క్యాంప్ కార్యాలయాల్లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. రిజిస్టర్ కోఆపరేటివ్ సొసైటీ కమిషనర్ (మాజీ కలెక్టర్) రాహు ల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, రెవిన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్, అధికారులు, సిబ్బందితో కలిసి రంగులు పూసుకున్నారు. పండుగ శుభాకాంక్షలు తెలియ జేశారు. రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి నాగరాజు ఆధ్వ ర్యంలో పీడీలు, పీఈటిలు రంగులు చల్లారు.

### ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో హోలీ పండుగ వేడుకలను ఘనంగా జరిపారు. ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి వేడుకలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది పరస్పరం రంగులు చల్లుకొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. అదనపు ఎస్పీ మహేందర్, సీసీఎస్ ఇన్ స్పెక్టర్ రాజ శేఖర్ రెడ్డి, ఆర్ఐ శైలందర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

### మున్సిపల్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో..

మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్.. మెప్మా మహిళలతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. చైర్ పర్సన్ అయిన తర్వాత మొదటిసారిగా హోలీ సంబరాలలో పాల్గొనడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరి జీవితాలు రంగులమయంగా ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. 28వ వార్డు కౌన్సిలర్ అఖిల భరత్ తదితరులు పాల్గొన్నారు. 6వ వార్డులో కౌన్సిలర్ హరిత నర్సింగ్ రావు ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా జరిపారు. యువకులు, మహిళలు, చిన్నారులు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. వీధుల్లో చిన్న పిల్లలు సైతం రంగులు చల్లుతూ హంగామా చేశారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**- రైల్వే జీఎంను కలిసిన ఎంపీ రఘునందన్ రావు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
తన నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మెదక్ ఎంపీ రఘు నందన్ రావు సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంను కోరారు. ఎంపీ రఘునందన్ రావు మంగ ళవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవను కలిశారు. మెదక్ లోక్ సభ పరిధిలోని రైల్వే అభివృద్ధి పనులు, కొత్త ప్రాజెక్టులు, ప్రయాణికుల సదుపా యాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గ రైల్వే ప్రణాళికలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ముఖ్యంగా తెల్లాపూర్ ప్రాంతంలో నిర్మా ణంలో ఉన్న ఆర్.యు.బి పనుల పురోగతిపై చర్చించారు. అలాగే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా ఎంఎంటిఎస్ సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందని తెలియజేస్తూ వినతిపత్రం సమర్పించారు.

తెల్లాపూర్ నుంచి ఈదుల్ నాగులపల్లి వరకు, తెల్లాపూర్ నుంచి ఇక్రిసాట్ వరకు ఎంఎంటిఎస్ విస్తరణ చేయాలని, అలాగే ట్రైన్ల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈదుల నాగులపల్లి ప్రాంతంలో రైల్వే టెర్మి నల్ ఏర్పాటు చేయాలని జీఎంను కోరారు. ఈ టెర్మినల్ ఏర్పాటు ద్వారా భవిష్యత్తులో రైల్వే రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడటంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని సూచించారు. తెల్లాపూర్ ఎంఐజీ ప్రాంతం మధ్యలో ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించే విధంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలన్నారు. వీలై నంత తొందరగా డీపీఆర్ తయారు చేయాలని కోరారు.

మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అక్కన్నపేట రైల్వే స్టేషన్ వద్ద అజంతా ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిల పాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లాలో చిన్నకోడూరులో ఇటీవల మంజూ రు చేసిన రైల్వేస్టేషన్ పనులు తొందరగా ప్రారంభించాలని సూచించారు. అన్ని పనులు పూర్తయిన కొమురవెల్లి రైల్వేస్టేషన్ ని తొందరగా ప్రారంభించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

## యూరియా యాప్ ఎత్తివేయాలి



**ముద్ర, హైదరాబాద్:**
యూరియా యాప్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ సొసైటీ వద్ద రైతులు ఆందోళన చేశారు. ఆన్ లైన్‌లో బుక్ చేసుకున్న రైతులందరూ ఒకేసారి సొసైటీకి తరలిరావడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొన్నది. ముందుగా సొసైటీ పరిధిలోని రైతులకు ఇచ్చిన తర్వాతనే ఇతర గ్రామాల రైతులకు ఇవ్వాలంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో సొసైటీ వద్ద రైతులు కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. తమ వద్ద చిన్న ఫోన్లు ఉన్నాయని, బుకింగ్ చేయడం రాదని వాపోయారు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు యూరియా అవసరమైన తరుణంలో లభిచండంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఎలాంటి నిబం ధనలు లేకుండా యూరియా అందించాలని వారు కోరారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు

**ముద్ర, హైదరాబాద్:**
ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సిద్దిపేట జిల్లాలోని బెజ్జంకిలో విద్యుత్ ఎర్తింగ్ పనులు చేపట్టారు. గ్రామంలోని డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్) వద్ద ఉన్న ఎర్తింగ్ పాయింట్లలో ట్రాక్టర్ సహాయంతో నీటిని నింపారు.

# నిజామాబాద్‌లో 'పదవుల పోరు'..

**- గ్రీన్ సిగ్నల్‌తో ఆశావహుల్లో జోరు!**

**ముద్ర, హైదరాబాద్:**
నామినేటెడ్ పదవుల పందేరానికి కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నిజామాబాద్ రాజకీయాల్లో కొత్త కదలికలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 15 లోగా పదవుల భర్తీ పూర్తి చేయాలని పార్టీ నాయకత్వం సూచించినట్లు సమాచారం రావడంతో ఆశావహుల్లో ఉత్సాహం ఒక్కసారిగా పెరిగింది. ఇప్పటివరకు ఆలస్యం కారణంగా నిరాశలో ఉన్న నాయకులు ఇప్పుడు తమ ప్రయత్నాలను మరింత వేగవంతం చేశారు.

ఇప్పటికే కీలక నాయకులతో జరిగిన చర్చలకు ముందే మీనాక్షి నటరాజన్ సమగ్ర నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. జిల్లాల వారీగా ఎవరికి ఏ పదవి ఇవ్వాలన్న దానిపై స్పష్టమైన సూచనలు అందించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా పదవుల పంపకానికి అనుమతి వచ్చినట్లు వెల్లడించడంతో జిల్లాలో రాజకీయ సమీకరణాలు చాలా వేగంగా మారుతున్నాయి.

### ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం..

ఈసారి నామినేటెడ్ పదవుల్లో ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ఆర్టీసీ, గృహ



నిర్మాణం కార్పొరేషన్‌లలో ఏదో ఒకటి ఆయనకు ఇవ్వవచ్చని అంటున్నారు. లేకపోతే ప్రభుత్వ విప్ పదవిని కూడా పరిశీలనలో పెట్టినట్లు తెలుస్తోంది.

### సీనియర్లకు అవకాశం...

పార్టీకి దీర్ఘకాలంగా సేవలందించిన సీనియర్ నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలనే దిశగా ఆలోచన జరుగుతోంది. 1988 నుంచి కాంగ్రెస్‌లో పనిచేస్తున్న మార చంద్ర మోహన్ రెడ్డి, 1983 నుంచి సేవలందిస్తున్న బాడ్సి శేఖర్‌గౌడ్ వంటి నాయకులు రేసులో ముందున్నారు. శేఖర్‌గౌడ్‌కు గీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, కాటిపల్లి నరేందర్‌రెడ్డి, నరాల రత్నాకర్, కుంట రమేశ్‌రెడ్డి, బాస వేణుగోపాల్ యాదవ్ వంటి నేతలు కూడా నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సహకార సంస్థల పదవులు కూడా నామినేషన్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు వార్తలు రావడంతో ఆశావహుల సంఖ్య మరింత పెరి గింది. అయితే ఇప్పటికే పద వులు పొందిన వారికి పొడిగింపు ఇస్తారా? లేక రొటేషన్ విధానంలో కొత్తవారికి అవకాశాలు కల్పిస్తారా? అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

### యువతకు ఛాన్స్...

ఈసారి యువ నాయకులకు కూడా అవకాశాలు కల్పించేలా అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కొత్త ముఖాలకు ప్రాధాన్యం ఇస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలనే వ్యూహం కనిపిస్తోంది. ఇక డాక్టర్ కవితారెడ్డికి ఆరోగ్య వసతుల అభివృద్ధి కార్పొరేషన్ పదవి దాదాపు ఖరారైనట్లు సమాచారం. దీనితో మహిళా నాయకత్వానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

### తుది నిర్ణయం కోసం ఎదురుచూపు..

నిజామాబాద్‌లో నామినేటెడ్ పదవుల పందేరం ఇప్పుడు తారాస్థాయికి చేరుకుంది. సీనియర్లు, యువ నేతలు, ఎమ్మెల్యేలు—అందరూ ఒక్కో పోస్టు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తుండగా, తుది నిర్ణయం ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. వచ్చే కొన్ని రోజులు జిల్లాలో రాజకీయంగా కీలక మలుపు తిప్పే అవకాశముంది.

## దుబ్బాకను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేద్దాం

**ముద్ర, హైదరాబాద్:**
దుబ్బాకను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ తొలి కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు సమస్యలపై ఏకరువు పెట్టారు. దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీరామ్ సంగీతారవీందర్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వార్డుల్లో తాగునీరు, పారిశుధ్యం సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కౌన్సి లర్లు సమావేశం దృష్టికి తీసుకువెళ్లారు. అంతర్గత సీసీ రోడ్లు , డ్రైనేజీలు లేక అధ్వానంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్‌కు మంజూరైన నిధులతో ఒక్కో సమస్యను పరిష్కరించుకుం దామన్నారు. మున్సిపల్‌లోని 20 వార్డుల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను వార్డు కౌన్సిలర్లతో చర్చించి, ఒక బుక్‌లెట్ రూపొందించాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్‌కు సూచించారు.

## ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాం

**- సిద్దిపేట కలెక్టర్ హేమావతి**



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**
ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు సిద్దిపేట కలెక్టర్ కే.హేమావతి తెలిపారు. మంగళవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ఆమె మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కూడా వేగవంతంగా జరుగుతున్నట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణాలు ఆయా దశల్లో ఉన్నాయని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి కూడా వివరించారు.జిల్లాలో కొనసాగుతున్న ఆయా ప్రభుత్వ పథకాల గురించి ముఖ్యమంత్రికి వివరించారు.

## ఘనంగా హోలీ సంబరాలు



**ముద్ర, హైదరాబాద్:**
సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచే హోలీ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రంగులను ఒకరిపై ఒకరు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ హోలీ సంబురాల్లో మునిగి తేలారు. రాయపోల్ మండలంలోని వీరారెడ్డి పల్లి గ్రామంలో కేరింతల మధ్య గ్రామ యువకులు హోలీ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. వీరారెడ్డి పల్లి సర్పంచ్ రొయ్యల సుగుణ శ్రీనివాస్, నాయకుడు డీలర్ శ్రీనివాస్, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో చిన్నారులు, యువకులు, ప్రజలు ఘనంగా రంగుల పండుగ హోలీని జరుపుకున్నారు.

# ప్రతి ఒక్కరూ ప్రకృతి సమతుల్యాన్ని కాపాడాలి



**ముద్ర, హైదరాబాద్:**
ప్రకృతి సమతౌల్యాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మెదక్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్ జలీల్ కోరారు. మంగళవారం వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి గ్రామపంచాయతీలో అటవీ శాఖ, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, వన్యప్రాణులకు సురక్షితమైన ఆవాసాన్ని కల్పించడానికి చెట్లు నాటడం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి వృక్షాలుగా మారే వరకు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత గ్రామస్థులపై ఉందని వివరించారు. ప్రకృతి తోనే మన భవిష్యత్ ఆధారపడి ఉంటుం దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మానస రాములు, ఉప సర్పంచ్ మహేష్, ఫారెస్ట్ శిక్షణ ఆఫీసర్ శ్రీహరి, బీట్ ఆఫీసర్లు శోభారాణి, గబ్బర్ సింగ్, ధనలక్ష్మి , వార్డు సభ్యులు రూప విజయ్, నర్సింలు, మహేష్, సోనీ ప్రియా, సావిత్రి, నర్సింలు, మధు గౌడ్, సత్తెమ్మ, పోచ గౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఎండాకాలం జాగ్రత్తలు**



**తేలికపాటి ఆహారం తీసుకోవాలి**

ఎక్కువగా వేయించిన, మసాలా పదార్థాలు తగ్గించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకుంటే అలసట తగ్గుతుంది.



# ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా..

- **ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకనుగుణంగా పని చేయండి**
- **కలెక్టర్లతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసి ప్రభుత్వం, ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కలెక్టర్లకు సూచించారు. విధి నిర్వహణలో తీసుకునే నిర్ణయాలు ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో ఉండాలన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ తదితర జిల్లా కలెక్టర్లు మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో ప్రజా ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఈ సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి చేర్చవలసిన బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఎంతో ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల అవసరాలను అర్థం చేసుకొని పని చేయాలని కలెక్టర్లకు దిశ నిర్దేశం చేశారు. ఐఏఎస్ అధికారుల కెరీర్లో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని అన్నారు. ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతో పాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, జిల్లాల్లో పని చేసిన అనుభవమే భవిష్యత్తులో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజాపాలనలో ప్రజాకేంద్రంగా పాలన సాగాలని , ప్రజలకు మేలు చేసే పనులనే జిల్లా పాలకులుగా చేపట్టాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలుచేసి అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనన్నారు.



# నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరపాలి

- **టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి**
- **హెచ్‌సీఏకు వ్యతిరేకంగా జింఖానా గ్రౌండ్ వద్ద మెరుపు ధర్నా**

**ముద్ర, హైదరాబాద్ :**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో జరిగిన రూ.68.73 కోట్ల భారీ నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, విశాఖ ఇండస్ట్రీస్ నుంచి సొమ్మును వెనక్కి తీసుకుని గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి ఖర్చు చేయాలని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అధ్యక్షుడు, మాజీ స్పోర్ట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. రూ.4 కోట్లు ఇచ్చి.. రూ.68.73 కోట్లు కొల్లగొట్టిన దొంగల ముఠాను హెచ్‌సీఏ నుంచి తరిమికొట్టాలని అల్లీపురం అన్నారు. మంగళవారం జింఖానా గ్రౌండ్‌లో హెచ్‌సీఏ అధ్యక్షుడి సమావేశం జరుగుతున్న సమయంలో.. అల్లీపురం ఆధ్వర్యంలో టీడీసీఏ శ్రేణులు మెరుపు ధర్నాకు దిగాయి. హెచ్‌సీఏ నిధులు వెనక్కి రాకుంటే, రాష్ట్ర వ్యాప్తంగా టీడీసీఏ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.



# చంద్రబాబు పవన్ కీలక భేటీ

- **అభివృద్ధి అంశాలపై చర్చ**

**ముద్ర అమరావతి :**

వివిధ అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చర్చించారు. దాదాపు 2 గంటల పాటు జరిగిన ఈ భేటీలో నీటిపారుదల శాఖ పరిధిలోని డ్రెయిన్లలో పూడికతీత అంశాన్ని పవన్ ప్రస్తావించారు. వేసవిలో పూడికతీత మొదలుపెట్టి, రైతులు పంటలు వేసేలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అటవీ శాఖ చేపట్టిన హనుమాన్ ప్రాజెక్ట్ వివరాలను ముఖ్యమంత్రికి పవన్ తెలియజేశారు.

# మూసీ పనులకు బ్రేక్ ?

- **చెట్ల నరికివేతను అడ్డుకోండి**
- **ఎన్‌హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించిన న్యాయవాది రామారావు**
- **జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో కేసు నమోదు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పనులకు బ్రేక్ పడింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా.. మూసీ నది ఒడ్డున భారీగా చెట్లను నరికివేస్తున్నారంటూ ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది ఇమ్మనేని రామరావు ఇటీవల జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)ను ఆశ్రయించారు. ఆ ప్రాజెక్టుపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో రామారావు కేసు నమోదు చేశారు. మూసీ ప్రాజెక్టు పేరు చెప్పి.. ఆ నది చుట్టుపక్కల పర్యావరణ విధ్వంసం జరుగుతోందని.. దీన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూసీ పరివాహకంలో ఉన్న లంగర్ హౌస్, నార్సింగి, రాందేవ్‌గూడ ప్రాంతాల్లో ఎలాంటి సమగ్ర అధ్యయనం లేకుండానే.. ఎప్పటి నుంచో ఉన్న వేలాది మహా వృక్షాలను నరికేస్తున్నారని ఫిర్యాదులో వెల్లడించారు. చెట్లను తొలగించడంతో పర్యావరణ, సామాజిక ప్రభావంపై ఎలాంటి సోషల్ ఇంపాక్ట్ స్టడీ చేపట్టకుండానే ప్రభుత్వం పనులు ప్రారంభించిందని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. మూసీ నది తీరాన్ని తీవ్రంగా ధ్వంసం చేస్తున్నారని.. దాని వల్ల ప్రజల జీవనాధారంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే చెట్ల నరికివేతను వెంటనే ఆపాలని.. ప్రాజెక్ట్ అమలు సంస్థ అయిన మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహా రెడ్డికి ఆదేశాలు జారీ చేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీని లాయర్ ఇమ్మనేని రామారావు కోరారు. అదే సమయంలో పర్యావరణానికి హాని చేసే పనులను ఆపేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కారణంగా ప్రభావితం అయ్యే కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని పేర్కొన్నారు. లాయర్ ఇమ్మనేని రామారావు చేసిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న ఎన్ హెచ్ ఆర్సీ.. కేసు నమోదు చేసి దర్యాప్తును మొదలుపెట్టింది. విచారణ పూర్తయ్యే వరకు పనులు నిలిపేయాలని ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని పేర్కొన్న ఇమ్మనేని రామారావు.. మూసీ తీరాన్ని రక్షించేందుకు చట్టపరంగా తమ పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు. మరోవైపు.. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పనులకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న జనాలను బలవంతంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఖాళీ చేయిస్తోందని.. ఇప్పటికే స్థానికులు, ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. అదే సమయంలో గాంధీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా మూసీ ఒడ్డున భారీ మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం దాని కోసం భారీగా అక్కడ భారీగా ఇండ్లు, నిర్మాణాల కూల్చివేతలకు దిగిందన జరుగుతున్నాయని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ఆదిత్య అపార్ట్మెంట్లో ఫ్లాట్లు ఇవ్వండి

- **హైడ్రా కమిషనర్ బుల్డోజర్ తెచ్చే వరకు వదలం**
- **చెరువు మధ్యలో నిర్మాణాలు చేస్తుంటే కనిపించట్లేదా?**
- **టిఆర్ఎస్ అనుమతి ఇచ్చింది.. కాంగ్రెస్ వచ్చాక రద్దు చేసింది**
- **ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అనుమతి ఎలా ఇచ్చింది**
- **ధర్నా చేస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్టు**



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:**

మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్ నిర్వాసితులకు నార్సింగిలోని ఆదిత్య అపార్ట్మెంట్లో ఫ్లాట్లు ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. మూసిని పూడ్చి మధ్యలో ఆదిత్య అపార్ట్మెంట్లు కడుతుంటే ఇది బఫర్ జోన్ అని ప్రభుత్వానికి తెలియట్లేదా అంటూ నార్సింగిలోని అపార్ట్మెంట్ వద్ద కవిత ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ..... మూసీ నది మధ్యలో పెద్దవాళ్లు కడుతున్న బిల్డింగులను వదిలిపెట్టి పేదవాళ్ల బిల్డింగులు కూలగొడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందన్నారు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఈ అనుమతులు రద్దు చేసిందని తర్వాత కాంగ్రెస్ కి ఎలాంటి ఒప్పందం కుదిరిందో ఆ అనుమతులు కొనసాగిస్తోంది అని మండిపడ్డారు. పెద్దల పక్షాన్నే ప్రభుత్వాలు ఉన్నాయని చెప్పడానికి ఇదే నిదర్శనం అన్నారు.మూసీ రివర్ బెడ్ లో ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదు కానీ,అదే వెలుగుమట్లలో పేదలు వేసుకున్న గుడిసెలను బలవంతంగా కూల్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ శివారుల్లో పేదల ఇండ్లను కూల్చేసినందుకు ఈ ప్రభుత్వం తప్పకుండా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు.

**కవిత అరెస్ట్**

ఆదిత్య అపార్ట్మెంట్ వద్ద మధ్యాహ్నం నుండి కవిత దీక్ష చేస్తుండడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నార్సింగి పోలీసులు మంగళవారం రాత్రి కవితను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో పెద్ద ఎత్తున కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ....పోలీసులు బలప్రయోగంతో మిమ్మల్ని అరెస్ట్ చేయడం అన్యాయం అన్నారు. రేపు అయినా హైడ్రా బుల్‌డోజర్లు ఇక్కడికి వస్తేనే, రంగనాథ్ గారు స్పందించి చర్యలు తీసుకుంటేనే ఈ ప్రభుత్వం పేదల పక్షాన ఉన్నదని మేం భావిస్తాం అన్నారు. ఇతర నిర్మాణాలకు మూసీ ఒడ్డు నుంచి 30 మీటర్ల దూరం ఉండాలనే నిబంధనలు విధిస్తున్న ప్రభుత్వం కొందరు పెద్దల భవనాలు 5 మీటర్ల దూరంలోనే ఉన్న అనుమతులు ఇస్తున్నారంటే ఎంతటి అక్రమాలు జరుగుతున్నాయో తేలిపోతున్నది అన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై జాగృతి న్యాయపోరాటం చేస్తుందన్నారు.



# మూతబడ్డ ఆలయాలు

- **సంపూర్ణ చంద్రగ్రహణం ప్రభావం**
- **మధ్యాహ్నం 3.21 నుంచి రాత్రి 7.52 గ్రహణం**

**ముద్ర, డెస్క్**

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ దేవాలయాలను తాత్కాలికంగా మూసివేశారు. మంగళవారం మధ్యాహ్నం 3.21 గంటలకు గ్రహణం ప్రారంభమై రాత్రి 7.52 గంటల వరకు కొనసాగనున్న నేపథ్యంలో, ఆగమ శాస్త్రాల ప్రకారం ఆలయాలలో ప్రత్యేక నియమాలు అమల్లోకి తీసుకొచ్చారు. గ్రహణ ప్రభావం దృష్ట్యా తిరుమల తిరుపతి దేవస్థానంలో దర్శనాలు, సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు. సాయంత్రం శుద్ధి కార్యక్రమాల అనంతరం తిరిగి భక్తులకు దర్శనాలు ప్రారంభిస్తామని అధికారులు వెల్లడించారు. అలాగే కనకదుర్గమ్మ దేవాలయంలో కూడా గ్రహణ కాలంలో దర్శనాలను నిలిపివేశారు. గ్రహణం ముగిసిన తరువాత ఆలయ ప్రాంగణంలో శుద్ధి నిర్వహించి నిత్యకైంకర్యాలు కొనసాగించనున్నారు. తెలంగాణలోని ప్రముఖ క్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో కూడా భక్తుల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. అదేవిధంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గ్రహణ సమయానికి ఆలయ ద్వారాలను మూసివేసి, అనంతరం సంప్రోక్షణ చేపట్టి దర్శనాలు పునఃప్రారంభించనున్నారు. చంద్రగ్రహణం సమయంలో దేవాలయాలు మూసివేయడం హిందూ సంప్రదాయాల్లో భాగమని పండితులు తెలిపారు. గ్రహణం ముగిసిన తర్వాత ఆలయ ప్రాంగణంలో శుద్ధి నిర్వహించి, నైవేద్యాలు సమర్పించిన తరువాతే భక్తులకు దర్శనాలు కల్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. భక్తులు గ్రహణ సమయాల్లో ఆలయాలకు రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని దేవస్థాన అధికారులు సూచించారు.

# భారత్ కు ఆయిల్ కష్టాలు?

- **హర్మూజ్ జలసంధి మూసివేత**
- **నిలిచిపోయిన 150 ఆయిల్ ట్యాంకర్లు**
- **దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు?**

**ముద్ర డెస్క్ :**




ఇరాన్‌పై ఇజ్రాయెల్ - అమెరికా సైనిక దాడుల తరువాత, హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకా రవాణా మూసివేశారు. ఇరాన్ దక్షిణ సరిహద్దులో ఉన్న హోర్ముజ్ జలసంధి పెర్షియన్ గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో కలుపుతుంది. రవాణా నిలిచిపోవడంతో హెర్మూజ్ జలసంధి సమీపంలో 150 క్రూడాయిల్ ట్యాంకర్లు ఆగిపోయాయి. అయితే నిలిచిన ట్యాంకర్లపై ఇరాన్ దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. హర్మూజ్ సమీపంలో 3 ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసినట్లు సమాచారం. ఈ ప్రాంతంలోని చాలా నౌకలు యుటర్న్‌లు తీసుకున్నాయని, ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారని, ఒమన్ గల్ఫ్‌లో లంగరు వేసినట్లు తెలుస్తోంది. దీంతో సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్ దేశాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయి. ఎందుకంటే వాటి సముద్రమార్గ ముడి చమురు, లిక్విడ్ సహజ వాయువు ఎగుమతులు ఎక్కువగా హోర్ముజ్ జలసంధి గుండా వెళతాయి. మరోవైపు యుద్ధం కారణంగా క్రూడాయిల్ ధరలు భారీగా పెరుగుతున్నాయి. బ్యారెల్ ధర 10శాతం పెరిగి, 80 డాలర్లకు చేరుకుంది. బ్యారెల్ ధర 100 డాలర్లకు చేరుకునే అవకాశం ఉందని నిపుణుల అంచనా వేస్తున్నారు. కాగా, ఇరాన్ హెచ్చరికలతో ఆయిల్, గ్యాస్ రవాణాను షిప్పింగ్ కంపెనీలు, వ్యాపారులు పూర్తిగా ఆపేశారు. అరేబియా సముద్రంలో ఒమన్‌ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి హర్మ్యూజ్. ఇందులో ఓ చోట అత్యంత ఇరుకుగా.. కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. ఇది మొత్తం ప్రపంచం వినియోగించే దానిలో ఐదో వంతుకు సమానం. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది. హర్మూజ్ జలసంధి మూసివేస్తే భారత్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. మన దేశం దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జీలో సగానికిపైగా ఈ మార్గం నుంచే రావాల్సి ఉంటుంది. హర్మ్యూజ్ మీదుగానే వస్తుంది. ఇక రోజువారీ 55 లక్షల పీపాల చమురును భారత్ ఈ మార్గం నుంచి దిగుమతి చేసుకుంటోంది. ఇది భారత చమురు అవసరాల్లో 40 శాతానికి సమానం. హర్మ్యూజ్‌లో ఇబ్బందులతో ప్రపంచ చమురు మార్కెట్లపై భారీ ఎఫెక్ట్ పడుతోంది..

**ఎండాకాలం జాగ్రత్తలు**

పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం వారికి వేడి ప్రభావం త్వరగా ఉంటుంది. నీరు తాగుతున్నారో లేదో గమనించాలి.

# ప్రమాదం అంచున సరళాసాగర్...!

- మరమ్మతులకు నోచుకోక బీటలు వారిన సైఫన్లు
- ఆసియాలో మొదటి సైఫన్ సిస్టమ్ ప్రాజెక్టు
- ప్రాజెక్టు సామర్థ్యానికి నీటిమట్టం చేరితే ఆటోమేటిక్‌గా సైఫన్లు ఓపెన్
- బలహీనపడిన ఆనకట్ట
- బీఆర్ఎస్ అధికారంలో తెగిన ఆనకట్ట
- అధికారులు హెచ్చరించినా పట్టించుకోని కేసీఆర్ ప్రభుత్వం
- నిర్మాణం నుంచి మరమ్మతులకు నోచుకోని సైఫన్లు

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి**

ఆసియా ఖండంలోనే మొట్టమొదటి ఆటోమేటిక్ సైఫన్ వ్యవస్థగా, అరుదైన ఇంజనీరింగ్ అద్భుతంగా పేరుగాంచిన 'సరళాసాగర్' ప్రాజెక్టు నేడు పాలకుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. వనపర్తి సంస్థానాధీశుల కాలంలో నిర్మితమై, దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రమాదం అంచున కొట్టుమిట్టాడుతోంది. సైఫన్లు బీటలు వారి, ఆనకట్ట బలహీనపడినా.. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో 2019లో ఎదురైన చేదు అనుభవం మళ్ళీ పునరావృతమవుతుందేమోనని ఆయకట్టు రైతాంగం వణికిపోతోంది. వేలాది ఎకరాల సాగునీరు.. పది గ్రామాల తాగునీటి అవసరాలు తీర్చే ఈ చారిత్రక సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు కొత్త ప్రభుత్వంపైనే ఉంది.

**ప్రాజెక్టు వివరాలివి :**

వనపర్తి సంస్థానాన్ని పరిపాలించిన రెండవ రామేశ్వరరావు కాలంలో సరళాదేవి పేరుతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముందుగా అప్పటి అధికారులు అమెరికాలోని కాలిఫోర్నియాలో అధ్యయనం చేశారు. అనంతరం శంకరమ్మపేటలో (ప్రస్తుతం మదనాపురం మండలం) రూ. 35 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాజెక్టును 1949 సెప్టెంబరు 15న ఆనాటి హైదరాబాద్ మిలిటరీ గవర్నర్ జనరల్ జయంతో నాథ్ చౌదరి ఊకచెట్టు వాగుపై శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 0.42



టీఎంసీలు కాగా పది గ్రామాలకు సాగునీరు అందుతుంది. 1959 జూలై 26వ తేదీన సరళాసాగర్‌ను పూర్తి స్థాయి ప్రాజెక్టుగా తీర్చిదిద్దారు. ఈ ప్రాజెక్టుకు క్రస్ట్ గేట్లు అమర్చకుండా నీరు ప్రాజెక్టు స్థాయికి చేరుకున్న సమయంలో ఆటోమేటిక్‌గా నీరు వెళ్లేందుకు సైఫన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఈ పద్ధతి ఇండియాలోనే ఏ ప్రాజెక్టుకూ లేదు. ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటిమట్టం చేరినప్పుడు సైఫన్లు వాటంతట అవే ఆటోమేటిక్‌గా తెరుచుకుంటాయి. వర్షకాలంలో వాగులు ప్రవహిస్తేనే ప్రాజెక్టుకు నీరు వచ్చి చేరుతుంది. దీంతో వర్షాలు సమృద్ధిగా కురవకుంటే ప్రాజెక్టులో నీరు ఉండదు. ఇది దృష్టిలో పెట్టుకుని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిరంతరం నీటితో ఉండటానికి ప్రాజెక్టుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామన్‌పాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా రూ. 12 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని 2008లో చేపట్టారు. నాటి నుంచి అనేక గ్రామాల రైతుల పంటలకు నీరు అందిస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు పర్యవేక్షణ కొరవడడంతో 2019లో ఆనకట్టకు భారీ గండి పడింది. దీంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. 2020 ఆగస్టు నాటికి ఆనకట్టను పునరుద్ధరించారు.

**1960లో మొదటిసారి తెరుచుకున్న సైఫన్లు :**

సరళసాగర్ ప్రాజెక్టు సైఫన్లు ఆటోమేటిక్‌గా 1960లో మొదటిసారిగా తెరుచుకున్నాయి. 1964లో భారీ వర్షాలు రావడంతో ఈ ప్రాజెక్టు ఎగువన ఉన్న శంకరసముద్రం చెరువు ఆనకట్ట తెగి సరళాసాగర్‌కు భారీ వరద వచ్చింది. దీంతో ప్రాజెక్టు ఆనకట్ట తెగిపోయింది. నీటి ఉధృతిని తట్టుకునేందుకు రాతితో అలుగు ఏర్పాటు చేశారు. 2019లో సైఫన్లు తెరుచుకునే సమయంలోనే కట్ట తెగిపోవడంతో నీరంతా కృష్ణానదిలోకి వెళ్లింది. ప్రాజెక్టులో 1095 అడుగులకు నీరు చేరితే అన్ని సైఫన్లు ఆటోమేటిక్‌గా తెరుచుకుంటాయి. ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 82 క్యూసెక్కుల నీరు విడుదలై వనపర్తి జిల్లాలోని ఎనిమిది గ్రామాల్లో 3,769.20 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కుడి కాలువ ద్వారా 6.89 క్యూసెక్కుల నీరు విడుదలై రెండు గ్రామాల్లోని 388.22 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కొత్తకోట, మదనాపురం మండలాల పది గ్రామాలకు సాగునీరు చేరుతుంది. ఎడమ కాలువ ద్వారా మదనాపురం మండలంలోని శంకరమ్మపేట, దంతనూరు, మదనాపురం, తిర్మలాయపల్లి, రామన్‌పాడు, అజ్జకోలు, కొన్నూరు, నర్సింగాపురంలోని 3,769.20 ఎకరాలకు, కొత్తకోట మండలం రామానంతపురం, చర్లపల్లి గ్రామాల్లోని 388.22 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా పలు గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఇంతటి బృహత్తర ప్రాజెక్టుకు మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరుకుంది. ప్రపంచంలోనే రెండవ సైఫన్ సిస్టమ్ ప్రాజెక్టుగా పేరొందిన ఈ సరళసాగర్ ప్రాజెక్టుకు ఉన్న సైఫన్లు మరమ్మతుకు నోచుకోక బీటలు వారాయి. ఈ విషయాన్ని నీటిపారుదల శాఖ అధికారులు గత ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినా అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టి ఈ ప్రాజెక్టు సైఫన్ సిస్టమ్‌కు మరమ్మతులు చేయాలని ఇక్కడి రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి స్పందించి ఈ ప్రాజెక్టు మరమ్మత్తులపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే బాధ్యత ఉంది.

# బాలికపై అత్యాచారం కేసు

- నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష
- డీసీపీ (క్రైమ్స్) ముత్యంరెడ్డి

**ముద్ర, శేరిలింగంపల్లి:**

మైనర్ బాలికను అపహరించి ఆరు నెలల పాటు నిర్బంధించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు హైదరాబాద్ డీసీపీ (క్రైమ్స్) ముత్యంరెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన షేక్ నసీర్ అలియాస్ అహ్మద్ (35), స్వస్థలం వికారాబాద్ జిల్లా, ప్రస్తుతం దుండిగల్ నివాసి. 2021 అక్టోబర్ 29న మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఉన్న మైనర్ బాలికను బెదిరించి అపహరించాడు. బాలిక ఇంట్లో కనిపించకపోవడంతో ఆమె తండ్రి అక్టోబర్ 30న దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, క్రైమ్ నంబర్ 1016/2021గా ఐపీసీ సెక్షన్ 363 కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితుడు బాలికను ముంబైకు తీసుకెళ్లి సుమారు ఆరు నెలల పాటు ఒక గదిలో నిర్బంధించి పలుమార్లు అత్యాచారం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా ఐపీసీ సెక్షన్లు 376, 344, 506తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్లు చేర్చారు. నిందితుడిని మే 2022లో అరెస్టు చేసి, పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం నిందితుడిని దోషిగా తేల్చి కింది విధంగా శిక్ష విధించింది. పోక్సో చట్టం ప్రకారం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా; ఐపీసీ సెక్షన్ 363 కింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2,000 జరిమానా; ఐపీసీ సెక్షన్ 344 కింద 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.1,000 జరిమానా; ఐపీసీ సెక్షన్ 506 కింద 1 సంవత్సరం కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించింది. అదనంగా బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. పోక్సో కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సమగ్ర సమర్పణతో నిందితుడికి కఠిన శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులను డీసీపీ (క్రైమ్స్) ముత్యంరెడ్డి అభినందించారు. మహిళలు, బాలికల భద్రతకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# వినాశనపు అంచున విశ్వం

- అణు బాంబుల వాడకం దిశగా పరిణామాలు..
- ప్రపంచానికి శాపమా? మరణ శాసనమా?

**ముద్ర డెస్క్:**

ప్రకృతి ఒడిలో పచ్చగా వికసించాల్సిన మానవ నాగరికత నేడు స్వార్థం అనే చిచ్చులో కాలిపోతోంది. దేవుడు ప్రసాదించిన అద్భుతమైన మేధస్సును సృష్టి కోసం వాడాల్సింది పోయి వినాశనం కోసం వాడుతున్నాడు ఆధునిక మానవుడు. 84 లక్షల జీవరాశుల్లో కెల్లా అత్యంత తెలివైనవాడిగా అనిపించుకున్న మనిషి నేడు తన గోతిని తానే తవ్వుకుంటున్నాడు.

**ఒక్క అడుగు.. అగాధంలోకి!**

ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ - అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు కేవలం మూడు దేశాల సమస్య కాదు. ఇది ప్రపంచ వినాశనానికి నాంది పలికే ప్రమాద హెచ్చరిక. ఒక్క అణుబాంబు పేలినా అది గల్ఫ్ దేశాలకే పరిమితం కాదు. ఒక దేశం వాడితే మరో దేశం ప్రతీకారంగా అణ్వాయుధాలను ప్రయోగిస్తుంది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం కేవలం 100 అణుబాంబులు పేలితే చాలు ఈ భూగోళంపై సూర్యరశ్మి పడకుండా నల్లని పొగ కమ్మేస్తుంది. ఫలితంగా 'అణు



శీతాకాలం' ఏర్పడి పంటలు పండక ఆకలితో సర్వమానవాళి అంతరించిపోతుంది.

**స్వార్థం నిండిన మేధస్సు.. విధ్వంసానికి చిరునామా**

మనిషి తన ప్రత్యర్థిని నాశనం చేయాలనుకుంటున్నాడు. కానీ అణు యుద్ధంలో గెలిచేవారు ఎవరూ ఉండరు. మిగిలేది కేవలం వల్లకాడూ, బూడిద మాత్రమే. "నేను మూడవ ప్రపంచ యుద్ధం ఎలా జరుగుతుందో చెప్పలేను. కానీ నాలుగవ ప్రపంచ యుద్ధం మాత్రం రాళ్లతోనూ, కర్రలతోనూ జరుగుతుంది" అని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అన్నారు. అంటే మూడవ ప్రపంచ యుద్ధం (అణు యుద్ధం) జరిగితే మనిషి మళ్లీ రాతి యుగానికి వెళ్లిపోతాడనేది ఐన్‌స్టీన్ హెచ్చరిక.

**-ప్రస్తుత భయాందోళనలు**

ఇరాన్ యుద్ధంలో అణు ప్రయోగం జరిగితే ప్రపంచ ఇంధన వనరుల కేంద్రమైన గల్ఫ్ ప్రాంతం నామరూపాలు లేకుండా పోతుంది. అణ్వాయుధాలు గుట్టలుగా పేర్చుకున్న దేశాలు ఒకదానిపై ఒకటి ఆధిపత్యం ప్రదర్శించే క్రమంలో భూమండలాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి.

**శాంతి కావాలా? శ్మశానం కావాలా?**

ప్రకృతి ఇచ్చిన ఫలాలను అనుభవిస్తూ తోటి జీవులతో కలిసి జీవించాల్సిన మనిషి మారణహోమాన్ని కోరుకోవడం విషాదకరం. ఆ ఒక్క అణుబాంబు పేలడం అంటే మానవ నాగరికత పుస్తకంలో చివరి పేజీని తిప్పడమే. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు స్వార్థాన్ని వీడి శాంతి మార్గంలో పయనించకపోతే రేపటి తరం కోసం ఈ భూమి మిగలదు. మనం మన పిల్లలకు ఇచ్చేది అణు బాంబుల బూడిదనా? లేక పచ్చని ప్రకృతినా? నిర్ణయించుకోవాల్సింది మనమే.

# గల్ఫ్ దేశాలే టార్గెట్..

- మధ్యప్రాచ్యంలో మారుతున్న యుద్ధ తంత్రం

**ముద్ర డెస్క్ :**

మధ్యప్రాచ్యం మరోసారి ఉద్రిక్త పరిస్థితుల దిశగా కదులుతోంది. ఇరాన్ తన వ్యూహాన్ని మార్చి, అమెరికాతో నేరుగా ఢీకొనే బదులు అమెరికా మిత్రదేశాలపై పరోక్ష ఒత్తిడి పెంచే మార్గాన్ని ఎంచుకున్నట్లు అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**ప్రత్యక్షం నుంచి పరోక్షానికి వ్యూహ మార్పు**

అమెరికాతో ప్రత్యక్ష యుద్ధం భారీ నష్టాలకు దారితీస్తుందని అంచనా వేసిన ఇరాన్, "ప్రాక్సీ వార్" పద్ధతిని బలోపేతం చేస్తోంది. ముఖ్యంగా సౌదీ అరేబియా, యూఏఈ వంటి గల్ఫ్ దేశాల చమురు, గ్యాస్ స్థావరాలపై దృష్టి సారిస్తోంది. ఇవి అమెరికాకు వ్యూహాత్మక మిత్రదేశాలు కావడంతో వాటిపై దాడులు జరిగితే వాషింగ్టన్‌పై పరోక్ష ఒత్తిడి పెరుగుతుందని భావిస్తోంది.

**ఇంధన భద్రతకు ముప్పు**

గల్ఫ్ ప్రాంతం ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకం. చమురు శుద్ధి కేంద్రాలపై డ్రోన్ లేదా క్షిపణి దాడులు జరిగితే చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉంది. గతంలో సౌదీ చమురు క్షేత్రాలపై జరిగిన డ్రోన్ దాడులు ప్రపంచ మార్కెట్లను కుదిపేశాయి. ఇప్పుడు ఆధునిక డ్రోన్ సాంకేతికతతో ఇరాన్ మళ్లీ అదే వ్యూహాన్ని అనుసరిస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎంబసీలపై అప్రమత్తత**

గల్ఫ్ దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలు అప్రమత్తంగా ఉన్నాయి. డ్రోన్, సైబర్ దాడుల వంటి అసమాన యుద్ధ తంత్రాలతో ఒత్తిడి సృష్టించడం ఇరాన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు చెబుతున్నారు. గల్ఫ్ దేశాలు మాత్రం ఆత్మరక్షణ చర్యలకే పరిమితమవుతున్నాయి.



**పరిష్కారం దిశగా?**

ఈ ఉద్రిక్తతలు ప్రాంతీయ సమస్యకే పరిమితం కావు; ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన భద్రతపై ప్రభావం చూపే అంశం. దౌత్య చర్చలు, అంతర్జాతీయ సమన్వయం ద్వారానే పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చని నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే గల్ఫ్ ప్రాంతం మరోసారి ప్రపంచ సంక్షోభానికి కేంద్రంగా మారే ప్రమాదం ఉంది.

# అణు భయాలు, చమురు రాజకీయాలు

- ఇరాన్‌పై అమెరికా దాడుల అసలు కారణాలు

**ముద్ర డెస్క్ :**

పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇజ్రాయెల్ కలిసి "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" పేరుతో ఇరాన్‌పై దాడులు ప్రారంభించడంతో పరిస్థితి ఉద్రిక్తమైంది. ఈ ఘర్షణలకు చరిత్ర, అణు కార్యక్రమం, ప్రాంతీయ ఆధిపత్య పోరు, ఆర్థిక ప్రయోజనాలు ప్రధాన కారణాలుగా చెప్పబడుతున్నాయి.




**చరిత్రలో మొదలైన వైరం**

1950లలో ఇరాన్ ప్రధాని మహ్మద్ మొసద్దేఫ్ చమురు వనరులను జాతీయం చేయడం అమెరికా, బ్రిటన్‌కు నచ్చలేదు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో అమెరికా అనుకూల పాలన ఏర్పడింది. అయితే 1979 ఇస్లామిక్ విప్లవంతో పరిస్థితి పూర్తిగా మారింది. అయతుల్లా రూహొల్లా ఖోమేనీ నాయకత్వంలో జరిగిన విప్లవం తర్వాత అమెరికాతో సంబంధాలు దెబ్బతిన్నాయి.

**అణు భయం, ఇజ్రాయెల్ అంశం**

ఇరాన్ అణు కార్యక్రమం అమెరికా, ఇజ్రాయెల్‌కు పెద్ద ఆందోళనగా మారింది. 2015లో అణు ఒప్పందం కుదిరినా, 2018లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ ఒప్పందం నుంచి బయటకు రావడంతో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి. ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తున్న హమాస్, హెజ్బొల్లా వంటి సంఘాలకు ఇరాన్ మద్దతు ఇస్తోందని అమెరికా ఆరోపిస్తోంది.

**చమురు, డాలర్ ఆధిపత్యం**

పశ్చిమాసియా చమురు నిల్వలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకం. "పెట్రోడాలర్" వ్యవస్థ ద్వారా డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకోవడం అమెరికాకు వ్యూహాత్మక అవసరం. ఇరాన్ చమురు వ్యాపారంలో చైనా, రష్యాలతో సన్నిహిత సంబంధాలు పెంచుకోవడం అమెరికాకు నచ్చడం లేదు.

**వ్యూహాత్మక లక్ష్యం**

ఇరాన్ అణు సామర్థ్యాన్ని అడ్డుకోవడం, ఇజ్రాయెల్ భద్రతను కాపాడడం, చైనా-రష్యా ప్రభావాన్ని తగ్గించడం.. ఇవే అమెరికా చర్యల వెనుక ప్రధాన కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, ఇది కేవలం రెండు దేశాల మధ్య యుద్ధం కాదు; చరిత్ర, చమురు, అణు శక్తి, ప్రపంచ ఆధిపత్యం అన్నీ కలిసిన సంక్లిష్ట సమీకరణం.


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
04.03.2026 బుధవారం, హైదరాబాద్



**ఎండాకాలం జాగ్రత్తలు**

వాహనాల్లో పిల్లలను వదిలి వెళ్లకూడదు
పార్క్ చేసిన వాహనంలో ఉష్ణోగ్రత వేగంగా పెరుగుతుంది. ఇది ప్రాణాపాయం కలిగించవచ్చు.







# ఫైనల్ బెర్త్ కోసం భారత్–ఇంగ్లాండ్ పోరు

టీ20 ప్రపంచకప్ 2026 చివరి దశకు చేరుకుంది. మార్చి 5న ముంబైలోని వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇరు జట్లు టోర్నీలో అద్భుత ఫామ్‌లో కొనసాగుతుండటంతో ఫైనల్ టికెట్ కోసం పోరు ఉత్కంఠభరితంగా ఉండనుంది. ఈ ప్రపంచకప్‌లో భారత్, ఇంగ్లాండ్ జట్లు ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్‌లలో ఆరు విజయాలు సాధించాయి. ఈ నేపథ్యంలో మ్యాచ్‌కు వేదికైన వాంఖడే స్టేడియం గణాంకాలు ఆసక్తికరంగా మారాయి. వాంఖడే స్టేడియంలో భారత్ ఇప్పటివరకు ఆడిన ఏడు టీ20ల్లో ఐదు విజయాలు సాధించగా, రెండు మ్యాచ్‌లలో ఓటమి చవిచూసింది. ఫిబ్రవరి 2, 2025న ఇదే మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 247 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అలాగే ఇంగ్లాండ్‌ను 150 పరుగులకే పరిమితం చేసి ఘన విజయం సాధించింది. వాంఖడే పిచ్‌పై భారత బ్యాట్స్‌మెన్లు ఎప్పుడూ దూకుడుగా ఆడారు. విరాట్ కోహ్లీ మూడు మ్యాచ్‌లలో 197 పరుగులు చేసి రెండు హాఫ్ సెంచరీలు సాధించాడు. స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 54 బంతుల్లో 135 పరుగులు చేసి సంచలనం సృష్టించాడు. ఆ ఇన్నింగ్స్‌లో 13 సిక్సర్లు బాదాడు. రెండు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు సాధించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ఇక్కడ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో టీమిండియా విజయం సాధించింది. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ తొలి వికెట్‌కు 135 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. పీయూష్ చావ్లా, రిషబ్ పంత్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ, శివమ్ దూబే ఒక్కోసారి సున్నా పరుగులకే ఔటయ్యారు. బౌలింగ్‌లోనూ భారత్ మెరుగైన గణాంకాలు నమోదు చేసింది. మహ్మద్ షమీ రెండు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు పడగొట్టాడు. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో శివమ్ మావి నాలుగు ఓవర్లలో 22 పరుగులకే నాలుగు వికెట్లు తీసి ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. 2022 టీ20 ప్రపంచకప్ సెమీఫైనల్లో ఇంగ్లాండ్ 10 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. అయితే 2024 సెమీఫైనల్లో భారత్ ఇంగ్లాండ్‌పై గెలిచి ప్రతీకారం తీర్చుకుంది. ఇప్పటివరకు భారత్, ఇంగ్లాండ్ జట్లు రెండేసి సార్లు టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకున్నాయి. ఈ మ్యాచ్‌లో విజయం సాధించే జట్టు మూడోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచే అవకాశాన్ని దక్కించుకోనుంది.

## సురక్షితంగా స్వదేశానికి పీవీ సింధు

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దుబాయ్‌లో నిలిచిపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు సురక్షితంగా బెంగళూరుకు చేరుకుంది. ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్‌స్‌లో పాల్గొనేందుకు బర్మింగ్‌హామ్‌కు వెళ్తుండగా ట్రాన్సిట్‌లో విమాన సర్వీసులు నిలిచిపోవడంతో ఆమె అక్కడే ఆగిపోయింది. సమీపంలో పేలుడు సంభవించడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారినట్లు సమాచారం. మార్చి 3న ఎక్స్ వేదికగా స్పందించిన సింధు తాను క్షేమంగా ఇంటికి చేరినట్లు తెలిపింది. ఈ పరిణామాలతో ఆమె టోర్నీకి దూరమైనట్లు తెలిసింది.



## భారత్‌లోనే విండీస్, జింబాబ్వే

**యుద్ధ ప్రభావంతో నిలిచిన విమాన సర్వీసులు**

అమెరికా-ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం టీ20 ప్రపంచకప్ 2026పై పడింది. సూపర్8 దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించిన వెస్టిండీస్ జట్టు స్వదేశానికి తిరిగి వెళ్లలేక భారత్‌లోనే ఆగిపోయింది. గల్ఫ్ ప్రాంతాల్లో భద్రతా ఆంక్షల కారణంగా విమాన సర్వీసులు రద్దు కావడంతో దుబాయ్ మార్గం ద్వారా ప్రయాణం సాధ్యపడలేదు. జట్టును త్వరగా స్వదేశానికి పంపేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విండీస్ క్రికెట్ బోర్డు తెలిపింది. ఐసీసీ, బీసీసీఐ కూడా సహకరిస్తున్నాయి.ఇదే పరిస్థితి జింబాబ్వే జట్టుకూ ఎదురైంది. సూపర్8లోనే బయటకు వచ్చిన ఆ జట్టు కూడా విమానాల నిలిపివేతతో భారత్‌లోనే నిలిచిపోయింది. వారి ప్రయాణ ఏర్పాట్లను ఐసీసీ పర్యవేక్షిస్తోంది. ఇక సెమీఫైనల్స్‌కు గ్రూప్1 నుంచి భారత్, సౌతాఫ్రికా; గ్రూప్2 నుంచి ఇంగ్లండ్, న్యూజిలాండ్ అర్హత సాధించాయి. తొలి సెమీఫైనల్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో, రెండో మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగనుంది.

## యువీ.. కోహ్లీ.. ఓ సంజూ

- **ఆ ఇద్దరిని గుర్తు చేసిన శ్యాంసన్**

టీ20 ప్రపంచకప్ 2026 క్వార్టర్ ఫైనల్‌లో విండీస్‌పై భారత్ సాధించిన విజయంలో సంజు శాంసన్ కీలక పాత్ర పోషించాడు. అజేయంగా 97 పరుగులు చేసి జట్టును గెలిపించిన అతడు, చివర్లో బౌండరీ కొట్టి చేసిన సంబరాలతో అభిమానులకు గతంలోని రెండు చారిత్రాత్మక ఇన్నింగ్స్ గుర్తు చేశాడు. మొదటగా 2011 వన్డే ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్ గుర్తుకొస్తుంది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఎదుర్కొన్న భారత్ తరఫున యువరాజ్ సింగ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మెరిశాడు. లక్ష్య ఛేదనలో కీలక సమయంలో వికెట్లు పడిపోవడంతో ఒత్తిడి పెరిగినా, యువరాజ్ సింగ్ క్రీజ్‌లో నిలిచి జట్టును విజయానికి చేర్చాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత అతడు చేసిన సంబరాలు అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి. తర్వాత 2016 టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై జరిగిన కీలక పోరులో విరాట్ కోహ్లీ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. 161 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సిన ఆ మ్యాచ్‌లో 82 పరుగులు చేసి భారత్‌ను విజయానికి చేర్చాడు. విన్నింగ్ షాట్ తర్వాత అతని భావోద్వేగ స్పందన ఆ మ్యాచ్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు అదే తరహాలో సంజు శాంసన్ కూడా ఒత్తిడిని తట్టుకుని జట్టును గెలిపించాడు. టాప్ ఆర్డర్ విఫలమైన పరిస్థితుల్లో ఒక ఎండ్‌లో స్థిరంగా నిలిచి, సమయానుకూలంగా బౌండరీలు బాదుతూ మ్యాచ్‌ను తన వైపు తిప్పుకున్నాడు. 50 బంతుల్లో 97 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్ని అందించాడు. ఒత్తిడి సమయంలో జట్టును గెలిపించే ఆటగాళ్ల సరసన సంజు శాంసన్ పేరు కూడా ఇప్పుడు నిలిచిపోయిందని చెప్పాలి.





## చాహల్–మహవాష్ అనుబంధంపై మళ్లీ చర్చ

టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, కంటెంట్ క్రియేటర్ ఆర్జే మహవాష్‌ల అనుబంధం మరోసారి వార్తల్లో నిలిచింది. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాపరాజీలు మహవాష్‌ను ఇష్టమైన క్రికెటర్ ఎవరో ప్రశ్నించారు. చాహల్ పేరు రాబట్టాలనే ప్రయత్నం ఉందని గుర్తించిన ఆమె, "కాంట్రవర్సీ క్రియేట్ చేయాలని చూస్తున్నావు కదా" అంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చారు.2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ సమయంలో వీరిద్దరూ కలిసి కనిపించడంతో డేటింగ్ ప్రచారం మొదలైంది. అయితే 2026 ప్రారంభంలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడంతో వారి సంబంధంపై మళ్లీ చర్చ మొదలైంది. ఈ విషయంపై ఇద్దరూ అధికారికంగా స్పందించలేదు.





సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
04.03.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## వైట్ హౌస్ దృశ్యంపై గాయని కేశా ఆగ్రహం

అమెరికా ప్రభుత్వ అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో విడుదలైన ఒక యుద్ధ దృశ్యం అంతర్జాతీయంగా వివాదానికి దారితీసింది. ప్రముఖ గాయని కేశా తన అనుమతి లేకుండా తన పాటను సైనిక దాడి దృశ్యాలకు ఉపయోగించడంపై తీవ్రంగా స్పందించారు. ఫిబ్రవరి 10, 2026న వైట్ హౌస్ తమ అధికారిక ఖాతాలో ఒక దాడి దృశ్యాన్ని ప్రసారం చేసింది. మధ్యప్రాచ్యంలో, ముఖ్యంగా ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ దృశ్యం విడుదలైనట్లు భావిస్తున్నారు. ఇందులో యుద్ధవిమానం ఒక నౌకపై క్షిపణి దాడి చేస్తున్న భాగాలు చూపించారు. ఆ దృశ్యాలకు కేశా గతంలో పాడిన ఒక ప్రసిద్ధ పాటను నేపథ్యంగా వినియోగించారు. దీనిపై కేశా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యుద్ధం, హింసను ప్రోత్సహించే విధంగా తన సంగీతాన్ని వాడుకోవడం అసహ్యకరమని ఆమె పేర్కొన్నారు. తన అనుమతి లేకుండా తన పాటను ఉపయోగించడం తగదని స్పష్టం చేశారు.గతంలో కూడా పలువురు గాయకులు తమ పాటలను రాజకీయ లేదా సైనిక అవసరాలకు అనుమతి లేకుండా వినియోగించడాన్ని వ్యతిరేకించారు. తాజా ఘటనతో మరోసారి కళాకారుల హక్కులపై చర్చ మొదలైంది.



## విరోష్ రిసెప్షన్‌కు క్యూఆర్ కోడ్

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ మరియు రష్మిక మందన్న వివాహ వేడుకల తర్వాత హైదరాబాద్‌లో నిర్వహించనున్న గ్రాండ్ రిసెప్షన్‌కు సంబంధించి కీలక మార్గదర్శకాలు వెల్లడయ్యాయి. రిసెప్షన్‌కు హాజరుకావాలంటే క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ఉండాలని నిర్వాహకులు స్పష్టం చేసినట్లు సమాచారం.ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్లో వీరి పెళ్లి అత్యంత వ్యక్తిగతంగా జరిగింది. ఇప్పుడు మార్చి 4, 2026న హైదరాబాద్‌లో జరగనున్న రిసెప్షన్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే ఈ వేడుకకు కేవలం ఆహ్వానం అందుకున్న అతిథులకే అనుమతి ఉంటుందని వెల్లడించారు. ప్రతి ఆహ్వానితుడికి ప్రత్యేకంగా ఒకసారి మాత్రమే ఉపయోగించగల క్యూఆర్ కోడ్‌ను పంపినట్లు తెలిసింది. వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్కానింగ్ వ్యవస్థ ద్వారా ఆ కోడ్‌ను ధృవీకరించిన తర్వాతే ప్రవేశం కల్పించనున్నారు. ఆహ్వాన పత్రిక లేదా క్యూఆర్ కోడ్ లేని వారు కార్యక్రమ ప్రాంగణానికి రాకూడదని విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. భారీ సంఖ్యలో అభిమానులు వచ్చే అవకాశం ఉండటంతో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది. వేడుక జరిగే ప్రాంతంలో పోలీసులు పర్యవేక్షణ చేపట్టనున్నారని సమాచారం.



## ఇరాన్ వెళ్తే నన్ను చంపేస్తారు..

### ఎల్నాజ్ నౌరౌజీ సంచలన వ్యాఖ్యలు

భారత్‌లో స్కేర్డ్ వెబ్ సిరీస్ ద్వారా గుర్తింపు పొందిన ఇరానియన్ నటి ఎల్నాజ్ నౌరౌజీ తాజాగా చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారి తీశాయి. ఇరాన్‌లో ప్రస్తుత పాలన కొనసాగుతున్నంత కాలం తాను తన మాతృదేశానికి వెళ్లే పరిస్థితి లేదని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతి చెందినట్లు వార్తలు వెలువడిన సందర్భంగా ఆమె స్పందించిన తీరు కూడా వార్తల్లో నిలిచింది. ఇరాన్ ప్రభుత్వ విధానాలపై తనకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని, అక్కడి రాజకీయ పరిస్థితుల కారణంగా తాను స్వదేశానికి వెళ్లడం ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్‌లో అడుగుపెడితే తన ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశముందని ఎల్నాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేస్తున్నందున లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉందని ఆమె భావిస్తున్నారు. ఎల్నాజ్ చిన్న వయసులోనే ఇరాన్‌ను విడిచిపెట్టి యూరప్‌లో స్థిరపడ్డారు. అక్కడ మోడలింగ్‌లో శిక్షణ పొందిన ఆమె, తర్వాత నటనపై ఆసక్తితో భారతదేశానికి వచ్చి సినీ, వెబ్ రంగాల్లో అవకాశాలు అందుకున్నారు.

## కొడుకు రామ్ చరణ్ డాన్స్ కు ఫిదా అయినా చిరంజీవి



పవర్ స్టార్ రామ్ చరణ్ – దర్శకుడు బుచ్చిబాబు సాన కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం పెద్ది ఇప్పటికే భారీ అంచనాలు సృష్టిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన తొలి పాట ‘రయ్ రయ్ రారా’ విడుదలైన నాటి నుంచే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మాస్ బీట్, ఎనర్జిటిక్ విజువల్స్‌తో ఈ సాంగ్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి తన స్పందనను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. పాటలో కనిపించిన ఉత్సాహం, భావోద్వేగం, విజువల్ గ్రాండియర్ తనను బాగా ఇంప్రెస్ చేసాయని తెలిపారు. ముఖ్యంగా రామ్ చరణ్ డ్యాన్స్ మూమెంట్స్ చూసినప్పుడు తండ్రిగా తనకు ఎంతో ఆనందంగా, గర్వంగా అనిపించిందని పేర్కొన్నారు. ఈ పాటతో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయని ఆయన అభిప్రాయపడ్డారు. అద్భుతమైన సంగీతాన్ని అందించిన ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్‌ను చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే డ్యాన్స్ కంపోజ్ చేసిన జానీ మాస్టర్, ఆకట్టుకునే ఫ్రేమ్‌లను అందించిన సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, భావపూరితమైన పదాలు రాసిన అనంత శ్రీరామ్, నిర్మాత వెంకట సతీష్ కిలారు లకు కూడా తన శుభాకాంక్షలు తెలిపారు.మెగాస్టార్ నుంచి వచ్చిన ఈ ప్రశంసలు మెగా అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. ఇప్పటికే సాంగ్‌తో సెన్సేషన్ సృష్టిస్తున్న ‘పెద్ది’ సినిమా, విడుదలకు ముందే పాజిటివ్ వైబ్స్ సొంతం చేసుకుంటోంది.

## సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన రేణుదేశాయ్



ప్రముఖ నటి రేణుదేశాయ్ సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న అసభ్య వ్యాఖ్యలు, దూషణలపై చర్యలు తీసుకోవాలంటూ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్లను ఆశ్రయించారు. కొంతకాలంగా కొన్ని సోషల్ మీడియా అకౌంట్లు తనపై హద్దుమీరిన వ్యాఖ్యలు చేస్తున్నాయని ఆమె ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా ఇటీవల చేసిన కొన్ని సామాజిక అంశాలపై వ్యాఖ్యలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అకౌంట్ల వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.సామాజిక బాధ్యతతోనే తాను అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నానని, వ్యక్తిగతంగా దూషించడం సరైంది కాదని రేణుదేశాయ్ అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో బాధ్యతాయుత ప్రవర్తన అవసరమని, చట్టపరమైన చర్యల ద్వారా తప్పు చేస్తున్న వారికి బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతోనే పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది.

## ఉస్తాద్ భగత్ సింగ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ ఫిక్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’ ప్రమోషన్లు వేగం పుంజుకున్నాయి. ఇప్పటికే విడుదల తేదీ ప్రకటించడంతో అభిమానుల్లో జోష్ పెరిగింది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ కూడా ఖరారైంది. చిత్రబృందం అధికారికంగా ప్రకటించిన ప్రకారం, ఈ నెల 19న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ వేడుకను అత్యంత వైభవంగా ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. పవన్ కళ్యాణ్ స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలుస్తోంది. దీంతో ఈ ఈవెంట్ టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. మాస్ ఎలిమెంట్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్, యాక్షన్ సీక్వెన్స్‌లతో సినిమా ప్రేక్షకులను అలరించబోతుందని టాక్ వినిపిస్తోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ట్రైలర్ లేదా ప్రత్యేక గ్లింప్స్ విడుదల చేసే అవకాశం కూడా ఉందని ప్రచారం. మొత్తానికి ‘ఉస్తాద్ భగత్ సింగ్’ ఈవెంట్‌తో ఫ్యాన్స్‌కు పండగ వాతావరణం ఖాయం





## నోయర్ స్టైల్‌తో హీట్ పెంచుతున్న నిధి

టాలీవుడ్‌లో గ్లామర్‌కు కొత్త నిర్వచనం వస్తోంది. ప్రతి ఈవెంట్, ప్రతి ఫొటోషూట్ ఇప్పుడు ఫ్యాషన్ ప్రదర్శనగా మారింది. రెడ్ కార్పెట్ వేడుకలే కాక సాధారణ కార్యక్రమాల్లో కూడా హీరోయిన్లు ధైర్యమైన డిజైన్లు, అంతర్జాతీయ ట్రెండ్లతో ప్రత్యేక గుర్తింపు సంపాదించేందుకు పోటీ పడుతున్నారు. ఈ గ్లామర్ పందెంలో ముందంజలో నిలవడానికి కొత్త కొత్త రూపాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ ట్రెండ్‌కు సరితూగేలా కనిపిస్తున్న నటి నిధి అగర్వాల్ తాజాగా తన నోయర్ శైలితో ఆకర్షించింది. నల్లని రంగులో రూపొందించిన ఆమె దుస్తులు క్లాసిక్‌తో పాటు ధైర్యమైన శైలిని ప్రతిబింబించాయి. గట్టిగా కుట్టిన కార్సెట్ శైలిలో ఉన్న పై భాగం, పలుచని అలంకరణలతో మెరిసింది. హాల్టర్ నెక్ ఆకృతి దుస్తులకు ఆధునిక మెరుపు తీసుకొచ్చింది. కింద భాగంలో శరీర ఆకృతిని హైలైట్ చేసేలా పొడవైన స్కర్ట్‌ను జతచేశారు. నడుము భాగంలో ఉన్న కట్ డిజైన్ దుస్తులకు మరింత ధైర్యమైన టచ్ ఇచ్చింది. పైభాగం బలమైన రూపాన్ని చూపిస్తే, కింద భాగంలోని మృదువైన వదనం సమతౌల్యాన్ని తీసుకొచ్చింది. అలంకరణలు తక్కువగా ఉంచి, జుట్టును సూటిగా అలంకరించడం ద్వారా మొత్తం రూపాన్ని మరింత అందంగా మలిచింది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com